జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

విజయవాడ నగరంలో
రాఘవయ్య పార్క్ వద్ద గల
మన ఆఫీస్ లో
స్నేహా గ్రూప్ సభ్యులకు
సమావేశాలు
నిర్వహించుకునేందుకు
40 మంది వరకు
అవకాశం కల్పించబడును
వివరాలకు ఈ క్రింది నెంబర్లలలో సంప్రదించగలరు
9000621111, 9440137451


సంపుటి 15 సంచిక 229 విశాఖపట్నం | గురువారం 05 మే 2022 | 8 పేజీలు | వెల : 5.00



# మంత్రుల్లో భయం భయం ?

విజయవాడ, మే 4,(ప్రజాపాలన ప్రతినిధి) : :కొత్త మంత్రులు వచ్చారు. వారి సంఖ్య 14 మంది.. పాతవారే 11 మంది.. మొత్తం 25..అయినా జగన్ తెలివిగా మరో ఇరవైదు మందికి అవకాశం ఇవ్వనున్నారు. వీరిని జిల్లాలకు సంబంధించి అభివృద్ధి మండళ్ల చైర్మన్లుగా నియమించనున్నారు. అంటే వీళ్లకు కూడా క్యాబినెట్ ర్యాంక్ ఉంటుంది. మంత్రి హోదాలోనే వీళ్లంతా జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాల, నియోజకవర్గాల పర్యటనల్లో తిరుగాడుతుంటారు. ప్రస్తుతానికి వీరంతా జగన్ నోటిఫై చేసిన 26 జిల్లాలకు అధ్యక్షులుగా ఉన్నారు. ఆ విధంగా వీళ్ళ వైసీపీ పనులు చక్కదిద్దుతున్నారు. క్షేత్ర స్థాయిలో వీళ్లింకా యాక్టివ్ కాలేదు. అందుకు కారణంగా వీళ్లంతా జిల్లా అధ్యక్షులుగానో లేదా రీజనల్ కో ఆర్డినేటర్లుగానే ఉండడం వల్ల వీరు పార్టీకి ఉపయోగపడతారు సరే కానీ తరువాత మాకేంటి లాభం అన్న విధంగా ఉన్నారు. అందుకే పార్టీ పదవులు దక్కిన వారెవ్వరూ హ్యాపీగా లేరు. పార్టీ పదవులు అందుకున్నా జిల్లా స్థాయిలో వీరు యాక్టివ్ కావడం అన్నది జరగని పని అని కూడా తేలిపోయింది. గతంలో చేసిన మంత్రులు అదేలేండి మాజీలు పదవీచ్యుతులు అవ్వగానే ఇంటికే పరిమితం అయిపోయారు. కొందరు మాత్రం తెలివిగా తమ బాధ్యతల్లో కొంత భాగం తమ వారసులు చూసుకుంటారు అని చెప్పి తప్పుకుంటున్నారు.ఆ విధంగా వీళ్లంతా ఎండలు కారణంగా ఇంటికే పరిమితం. ఇంకా చెప్పాలంటే పదవి లేని కారణంగా చాలా విషయాల్లో తమకు ప్రాధాన్యం ఎక్కువగా దక్కకపోవడం వల్ల ఇంటికే పరిమితం. ఇక త్వరలో గడగడపకూ వైస్సార్సీపీ కార్యక్రమా న్ని నిర్వహించనున్నారు. అంటే వీళ్లంతా సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి.. ఏ విధంగా ప్రభుత్వ పాలన ఉంది అన్నది తెలుసుకోవాలి.క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి అడిగి రావాలి. కానీ సంక్షేమ ఫలాలు ఎంతమంది అందుకుంటున్నారు పోనీ అర్హులకే అన్నీ అందుతున్నా రాష్ట్ర జనాభా వీరి వాటా ఎంత? చాలా అంటే చాలా తక్కువ. మరి సంక్షేమ పథ కాలు అందని వారు తిరుగుబాటు చేస్తే ఏమవ్వాలి? అందుకే మంత్రులకు భయం..ఎమ్మెల్యేల కూ భయం. ఎంపీలకూ భయం. సమాజంలో సంక్షేమం ఒక్కటే ప్రాథమిక హక్కు అని అనుకుంటే మిగిలిన మౌలిక వసతుల కల్పన కూడా ప్రాథమిక హక్కులే ! వాటిని వదిలి ఎలా ఉంటారని ? ప్రాధాన్యం ఇవ్వకుండా ఉంటారని?

## ప్రజలకు ఇబ్బంది రాకుండా...
# భారీగా విద్యుత్ కొనుగోళ్లు
### విద్యుత్‌శాఖపై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి,(ప్రజాపాలన ప్రతినిధి) : తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. విద్యుత్ డిమాండ్-సప్లై, పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, భవిష్యత్‌లో చేపట్టనున్న ప్రాజెక్టులు తదితర అంశాలపై సీఎం సమీక్షించారు. వినియోగదారులకు ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో భారీగా విద్యుత్తును కొనుగోలు చేశామని అధికారులు తెలిపారు. మార్చిలో 1268.69 మిలియన్ యూనిట్లను రూ.1123.74 కోట్లు వెచ్చించి కొన్నామని, ఏప్రిల్‌లో 1047.78 మిలియన్ యూనిట్లు రూ.1022.42 కోట్లతో కొన్నామని అధికారులు పేర్కొన్నారు.డీబీటీద్వారా ఉచిత విద్యుత్తు డబ్బు రైతుల ఖాతాల్లో వేస్తామని, నేరుగా రైతులే చెల్లిస్తారని, దీనివల్ల విద్యుత్తు సేవలకు సంబంధించి రైతులు ప్రశ్నించగలుగుతారని సీఎం అన్నారు. శ్రీకాకుళంలో చేపట్టిన పైలట్‌ప్రాజెక్ట్ విజయవంతం అయ్యిందని, 2020-21లో జిల్లాలో 26,083 కనెక్షన్లకు 101.51 ఎం.యు. కరెంటు ఖర్చుకాగా, 2021- 2022లో కనెక్షన్లు పెరిగి 28,393కు చేరినా 67.76 ఎం.యు. కరెంటు మాత్రమే వినియోగించారని అధికారులు తెలిపారు.

## గత రబీ బియ్యం సేకరణకు..
# మరోసారి గడువు పెంపు



న్యూఢిల్లీ, :(ప్రజాపాలన ప్రతినిధి) : తెలంగాణతో నెలకొన్న ధాన్యం సేకరణ వివాదంపై కేంద్రం స్పందించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 2020-21 రబీ సీజన్లో పండిన వరి ధాన్యాన్ని మిల్లుపట్టించి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కు అప్పగించేందుకు మరోసారి గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మే 31లోగా మిగిలిన ధాన్యాన్ని మిల్లు పట్టించి సెంట్రల్ పూల్‌కు అప్పగించాలని పేర్కొంటూ, మరోసారి గడువు పెంపు ప్రసక్తే లేదని కేంద్రం స్పష్టం చేసింది. అలాగే ధాన్యం సేకరణ ఖర్చులను 2020-21 ధరల పట్టిక ప్రకారం కేంద్రం చెల్లిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ క్రమంలో బియ్యాన్ని 'రీసైక్లింగ్' చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం, ఎఫ్‌సీఐ కట్టడి చేయాలని సూచించింది. ఎఫ్‌సీఐ తనిఖీల సమయంలో బయటపడ్డ మిగులు బియ్యాన్ని మాత్రమే సెంట్రల్ పూల్‌కి అంగీకరించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మిల్లులవారిగా లేవీ బియ్యం మిగులుపై గణాంకాలు సేకరించి తీసుకుని, ఆ ప్రకారం సేకరించాలని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను కేంద్రం ఆదేశించింది. అలాగే ప్రొటోకాల్ ప్రకారం ఎఫ్‌సీఐకి చేరుకునే బియ్యానికి 'ఏజ్ టెస్ట్' (బియ్యం ఏ సీజన్‌కి చెందినవో తెలిపే పరీక్ష) నిర్వహించాలని కూడా కేంద్రం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

(మిగతా 2లో..)

## మీలో చలనం రావాలంటే
# ఇంకెంత మంది బలవ్వాలి




అమరావతి,(ప్రజాపాలన ప్రతినిధి): ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మీలో చలనం రావాలంటే ఇంకెంత మంది ఆడబిడ్డలు బలవ్వాలి జగన్ రెడ్డి గారు?. విజయనగరం జిల్లాలో అర్ధరాత్రి ఘోరం జరిగినా మీ మనస్సు కరగదా?. పైగా మహిళా హోంమంత్రి వనిత అత్యాచారాలు కొన్ని అలా జరుగుతూ ఉంటాయ్ అని మాట్లాడటం అన్యాయం. విజయనగరంలో హెడ్ కానిస్టేబుల్ కొడుకు చెర్రీ స్నేహితులతో కలిసి వివాహితపై అమానవీయంగా దాడి చేసి పిల్లల ఎదుటే అత్యాచారానికి పాల్పడ్డటం దారుణం. జే బ్రాండ్ లిక్కర్ తాగి ఉచ్చ నీచాలు మరిచి అత్యాచారానికి పాల్పడిన మృగాడిని కఠినంగా శిక్షించాలి. గాయపడిన మహిళకు మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలి. ప్రతి రోజు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల ఘటనలతో అసలు ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? లేదా? అనే అనుమానం కలుగుతుంది. దిశ చట్టం పేరుతో చేసిన మోసం చాలు. మహిళలు బయటకి రావాలంటేనే భయపడే పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్న నేపథ్యంలో మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి" అని లోకేష్ డిమాండ్ చేశారు.

## రసవత్తరంగా
# దుగ్గిరాల ఎంపీపీ ఎన్నికలు




గుంటూరు,(ప్రజాపాలన ప్రతినిధి) మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల ఎంపీపీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. దుగ్గిరాల ఎంపీపీ పదవిని కైవసం చేసుకునేందుకు అధికార వైసీపీ, టీడీపీ నేతలు ఎవరికి వారు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. దుగ్గిరాల మండలంలో మొత్తం 18 ఎంపీటీసీలు ఉన్నాయి. వీటిలో తొమ్మిది టీడీపీ, ఒకటి జనసేన, 8 మంది వైసీపీ అభ్యర్థులు ఎంపీటీసీలుగా గెలిచారు. అత్యధిక సీట్లు టీడీపీకి రావడంతో దుగ్గిరాల ఎంపీపీ స్థానం టీడీపీకి వచ్చే అవకాశం ఉంది.అయితే వైసీపీ తన అధికార బలాన్ని ఉపయోగిస్తోంది. గతంలో రెండు సార్లు ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసి సమావేశం ఏర్పాటు చేశారు. కానీ కోరం లేకపోవడంతో రెండుసార్లు ఎన్నిక వాయిదా వేశారు. అయితే 8 స్థానాలు వచ్చిన వైసీపీ.. ఎలాగైనా సరే దుగ్గిరాల ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని కుట్రలు పన్నుతోంది. టీడీపీ ఎంపీపీ అభ్యర్థిగా ఉన్న ముస్లిం మైనార్టీ అయిన జెమీనాకు బీసీ సర్టిఫికేట్ ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. తెలుగుదేశం, జనసేన కలిపి 10 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరిలో బీసీ మహిళలు లేరు. కానీ వైసీపీలో ఇద్దరు ఉన్నారు. (మిగతా 2లో..)

# ఆర్బీఐ కీలక నిర్ణయం



ఢిల్లీ,(ప్రజాపాలన ప్రతినిధి) : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. వడ్డీ రేట్లు 40 బేసిస్ పాయింట్లు పెంచింది. ఆర్బీఐ నిర్ణయంతో స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. 900 పాయింట్లకు పైగా సెన్సెక్స్ నష్టపోగా, 300 పాయింట్లకు పైగా నిఫ్టీ నష్టపోయింది.

# ఉత్తర కొరియా క్షిపణి పరీక్ష..

సియోల్, (ప్రజాపాలన ప్రతినిధి): ఉత్తర కొరియా బుధవారం నాడు బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించినట్లు దక్షిణ కొరియా సైనికాధికారులు తెలియజేశారు. ఈ క్షిపణి తూర్పు తీరం వైపు దూసుకెళ్లిందని వారు తెలిపారు. సాధ్యమైనంత వేగంగా అణ్వస్త్రాలు సంపాదించుకుంటామని కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించిన వారంలోగానే ఉత్తర కొరియా ఈ క్షిపణి పరీక్ష నిర్వహించింది. ఈ క్షిపణి 780 కిలోమీటర్ల ఎత్తులో 470 కిలోమీటర్లు ప్రయాణించిందనీ, శబ్దవేగం కన్నా 11 రెట్ల వేగంతో దూసుకెళ్లిందని దక్షిణ కొరియా సైనికాధికారులు తెలియజేశారు. ఈ ఏడాది ఉత్తర కొరియా జరిపిన 11వ క్షిపణి పరీక్ష ఇది. దక్షిణ కొరియా అధ్యక్షుడిగా ఎన్నికైన యూన్ సుక్ యేల్ పదవీస్వీకారానికి వారం రోజుల ముందు ఉత్తర కొరియా పక్కా ప్రణాళికతో ఈ ప్రయోగం నిర్వహించింది.ఉత్తర కొరియా గత నెలలోనే ఖండాంతర క్షిపణిని పరీక్షించి అంతర్జాతీయ సమాజాన్ని కలవరానికి గురిచేసింది. నిజానికి 2017 తరువాత ఉత్తర కొరియా ఈ తరహా క్షిపణుల పరీక్షలు నిర్వహించలేదు. తాజా పరీక్షలు పొరుగు దేశాలపైనా, అమెరికాపైనా దౌత్యపరమైన ఒత్తిడిని పెంచుతున్నాయని నిపుణులు అంటున్నారు.



ప్యాంగ్‌యాంగ్ తక్షణమే ఈ క్షిపణి పరీక్షలు నిలిపివేయాలని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ డిమాండ్ చేశారు. కొరియా ద్వీపకల్పానికి, పొరుగు దేశాలకు ప్రమాదకరమైన ఈ క్షిపణి పరీక్షలు భద్రతామండలి తీర్మానాలకు విరుద్ధమని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలను మీడియా ద్వారా
ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా
ఎదగాలనుకుంటున్నారా?
అయితే రండి.
రెండు తెలుగు రాష్ట్రాల లోని 294
నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని
గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో
మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్
మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)
రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం
అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని
(Master Key) సాధిద్దాం
వివరాలకు సంప్రదించండి
AP : 88869 11944
TS : 76600 27678, 88860 90484

# మూడేళ్ల వైకాపా పాలనలో సంక్షోభమే మిగిలింది

చిలకలూరిపేట, ప్రజాపాలన ప్రతినిధి : యడ్లపాడు మండలంలో, లింగారావుపాలెం గ్రామ అధ్యక్షులు సాదినేని సుదీర్, మైదవోలు గ్రామ అధ్యక్షులు నక్కా పోతురాజు, ప్రధాన కార్యదర్శి బడేటి సాంబయ్య ఆధ్వర్యంలో తలపెట్టిన బాదుడే బాదుడు కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగింది. ముందుగా గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, లింగారావుపాలెం గ్రామం మరియు మైదవోలు గ్రామంలో ప్రధాన వీధుల గుండా కొవ్వొత్తులతో ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి యడ్లపాడు మండలం అధ్యక్షులు ముద్దన నాగేశ్వర రావు అధ్యక్షత వహించడం జరిగింది. టిడిపి నాయకులు, ఇంటింటికి వెళ్లి కొవ్వొత్తులు, విసినకర్రలు, కరపత్రాలను పంపిణీ చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రివర్యులు, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ,రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ గురించి మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ అంటే నేరగాళ్లకు భయం లేకుండా పోయిందని, సత్తా, పత్తా లేని దిశ చట్టంతో మహిళలకు ఒరిగిందేమిటి

## మాజీ మంత్రివర్యులు, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు



అని ప్రశ్నించారు? మహిళలు బయటకు వెళ్లాలన్నా, ఇంట్లో ఉండాలన్నా భయపడే దుస్థితి నెలకొల్పారని ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేటలో పోలీసు వారు, వారి పని వారు చేసుకోవాలి. మా పని మేం చేసుకుంటాం. అంతేకానీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తాము అంటే ఊరుకునే పరిస్థితి లేదు. రేపు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరికి ఎలా బుద్ధి చెప్పాలో అలా చెబుతాను. రాష్ట్రంలో పోలీసులపై కూడా ప్రజలు తిరుగుబాటు మొదలవుతుంది. ప్రజల కోసం పని చేయాలి. ఎందుకంటే 60 సంవత్సరాలు ఉద్యోగంలో ఉండేది మీరు, ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రభుత్వాలు మారతాయి. ప్రభుత్వాలకు మీరు దాసోహం చెయ్యకూడదు. పోలీసులు కూడా చెప్తున్నా, ఎక్కడైనా అక్రమ కేసులు పెడితే మిమ్మల్ని కూడా వదిలిపెట్టను. ఈరోజు మీరు వాళ్ళ దగ్గర పని చేస్తే రేపు మా దగ్గర పని చేయాల్సి వస్తుంది. అది గుర్తుపెట్టుకోండి.

**మూడేళ్ల వైకాపా పాలనలో సంక్షోభమే మిగిలింది అంటూ మాట్లాడిన ప్రత్తిపాటి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను నిలువెత్తు మోసం చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుంది. తెలుగుదేశం పార్టీ హయాంలో బలహీన వర్గాల వారికి ఎస్సీ లకు కార్లు ఇచ్చాము. ఎస్సీ, ఎస్టీ ల కు, మైనార్టీలకు బడ్జెట్ ఉండేది. జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజలపై ఏ విధంగా నిత్యావసర సరుకుల ధరలు పెంచి ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయల పైన భారం మోపే విధంగా, ప్రతి ఒక్కటి రేట్లు పెంచారు. మద్యపానం నిషేధం అని మద్యం ధరలు విచ్చలవిడిగా తన సొంత బ్రాండ్ అమ్ముకుంటూ పేదల రక్తం తాగుతున్నాడు.

జగన్మోహన్ రెడ్డి హయాం అంతా మోసపు మాటలు తప్పా ఏమి లేదు?? ఒక అమ్మ ఒడి తప్పా, అది కూడా ఇప్పుడు ఎన్నో ఆంక్షలు పెడుతున్నాడు. చెప్పింది ఒకటి!! చేసేది ఒకటి??? మీ అందరికి తెలుసు జగన్మోహన్ రెడ్డి ఎన్ని మోసపు మాటలు, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు అనేది! చంద్రబాబు గారి హయాంలో పేదలకు అన్న క్యాంటీన్ ద్వారా 5 రూపాయలకి అన్నం పెట్టారు. ప్రజల పక్షాన తెలుగుదేశం పార్టీ ఎప్పుడు నిలుస్తుంది.

**ప్రజా సమస్యలు పట్టించుకోని జగన్ ప్రభుత్వం- జగన్మోహన్రెడ్డికి ధన దాహం తప్ప వేరొకటి లేదు: ప్రత్తిపాటి**

151 మంది ఎమ్మెల్యేలు, మంత్రులతో రాష్ట్రంలో వ్యాపారం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీలో గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులు విచ్చలవిడిగా వందలు వేల కోట్లు దోచేస్తున్నారు! దాచుకుంటున్నారు? ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవినీతి పాలన రాజ్యమేలుతోంది. త్వరలోనే ప్రజలు తిరుగుబాటు మొదలవుతుంది. ఈ రాష్ట్రంలో వైసిపికి ఓటు వేసిన వారు కూడా ఆనందంగా లేరు. సంక్షేమ పథకాలు పేరిట ఇచ్చేది గోరంత!!! దోచుకునేది కొండంత??? రానున్న రోజులలో ఏదో ఒక వంక చూపించి అన్ని పథకాలను రద్దు చేయాలని చూస్తున్నారు. అదేమిటి అంటే ప్రతిపక్షాలపై అబద్ధాలు చెప్పటం, ప్రతిపక్షాలు సంక్షేమం తీసివేయడం అంటుంది అని పచ్చి అబద్ధాలు చెప్పటం జగన్ మోహన్ రెడ్డి మాయమాటలు చెబుతున్నారు. ప్రజలకి మంచి చేస్తారు అంటే ఎవరైనా వద్దు అనే వాళ్ళు ఉంటారా. మీరు ఇచ్చిన హామీలు ఇచ్చినట్టు నెరవేర్చండి మేము మీకు సలాం చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగారావుపాలెం గ్రామ పార్టీ నాయకులు తోకల రాజేష్, కనపర్తి లక్ష్మీప్రసాద్, నంబూరి కృష్ణ రావు, కట్టా శ్రీహరి రావు, తోకల సాంబశివరావు (వ్యవసాయం), తోకల సుబ్బారావు, తోకల సాంబశివరావు, తోకల సుబ్బారావు(తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు),గుంటి కోటేశ్వరరావు, గుంటి శేఖర్ బాబు, రాయపూడి బ్రహ్మానాయుడు, లూదరయ్య, గుంటి సుబ్బారావు,జాకబ్ మిట్టనాదులు, షేక్ అలీ సాహెబ్, షేక్ దాదావలి, జీడిమల్ల నాగేశ్వర రావు, షేక్ కరిముల్లా, తోకల సుబ్బారావు (మండల ప్రచార కార్యదర్శి), కట్టా గోపి, ఆలోకం శ్రీకాంత్, . శ్రీనాథ్, మైదవోలు పార్టీ నాయకులు నక్కా కోటేశ్వరరావు, బసవ సురేశ్వరరావు, బాలతోటి కమల, భాష పద్మ శిరీష, గాండ్ల శివ కోటయ్య,ఇర్ల వెంకట శివ కుమార్, దావలపల్లి వెంకట అప్పారావు, కొమ్మబోయిన సుబ్బారావు, నక్కా రాజారావు , గాండ్ల శ్రీహరిరావు, గరిబోయిన రాజేంద్ర, దావల వెంకట ప్రసాద్, దావల సుబ్బారావు, గోనుగుంట్ల నాగేశ్వరరావు, పల్లపు కోటివీరయ్య, నక్కా సంజీవ రావు, పోతురాజు శివ శంకర్, తదితరులు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ముఖ్య నాయకులు, పట్టణ ప్రధాన కార్యదర్శి, పార్టీ నాయకులు, వార్డు మహిళలు, వివిధ హొదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# గత రబీ బియ్యం సేకరణకు.. మరోసారి గడువు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఏడోసారి పొడిగింపు

2020-21 రబీ సీజన్ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, సరఫరా చేయడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటి వరకూ 6 సార్లు గడువును పొడిగించిన కేంద్రం, తాజాగా మరోసారి పొడిగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ట్విటర్లో స్పందించారు. 6 పర్యాయాలు గడువు పొడిగించినా సరే రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ధాన్యం సరఫరా చేయకపోయిందని, చివరిసారిగా అవకాశమిస్తూ మే 31లోగా 2020-21 రబీ సీజన్‌కు సంబంధించిన మిగిలిన ధాన్యాన్ని సరఫరా చేయాలంటూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల కాపీని ఆయన తన ట్వీట్‌కి జతపరిచారు. గతవారం తాను రాసిన లేఖకు స్పందించి, ఈ అవకాశాన్ని ఇచ్చిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కృతజ్ఞతలు తెలియజేశారు. మోదీ ప్రభుత్వానికి రైతుల శ్రేయస్సు పట్ల ఉన్న నిబద్ధతను ఈ నిర్ణయం తెలియజేస్తుందని అన్నారు.

# రసవత్తరంగా దుగ్గిరాల ఎంపీపీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

దీంతో వీరిలో ఒకరిని వైసీపీ ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించింది.అయితే దుగ్గిరాల-2 ఎంపీటీసీగా గెలిచిన తాడిబోయిన పద్మావతి కూడా ఎంపీపీ పదవిని ఆశిస్తున్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ ఎంపీపీకి పద్మావతి మద్దతు ఇస్తారనే భయంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి బలవంతంగా ఆమెను తీసుకెళ్లారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తన తల్లి ఆరోగ్యం సరిగా లేకపోయినా ఎమ్మెల్యే ఆర్కే బలవంతంగా తీసుకెళ్లారని పద్మావతి కుమారుడు యుగంధర్ అంటున్నారు. పద్మావతి ఎంపీపీ కాకుండా ఉండేందుకు దుగ్గిరాల ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తమను వేధిస్తున్నాడని యుగంధర్ తెలిపారు. తమ కుటుంబాన్ని మానసికంగా వేధిస్తున్నారని.. తమకు ప్రాణహాని ఉందని పద్మావతి కుమారుడు యుగంధర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అటవికదాడి చేసిన పెత్తందార్లపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి

**పివి రావు మాల మహానాడు కృష్ణా ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు గోగులమూడి రాజు**




విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి : కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామ దళితులపై దుర్మార్గమైన కుల దురహంకార దారుణమైన అటవిక దాడులు చేసిన ఆధిపత్య అగ్రకుల పెత్తందార్లపై ఎస్ సి , ఎస్ టి అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి దళితులకు రక్షణ కల్పించి న్యాయం చెయ్యాలని పీవీ రావు మాల మహానాడు కృష్ణా ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. బుధవారంనాడు ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఏప్రిల్ 14 న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వేడుకలు దళిత యువకులు చేసుకుని ఆ ఫోటోలు సోషల్ మీడియాలో పెట్టారు . ఆ ఫోటోలపై ఆ గ్రామ ఆధిపత్య అగ్రకుల యువకుడు వరుణ్ అంబేద్కర్ గారిని కించపరుస్తూ కామెంట్ చేశాడు . ఈ విషయంపై దళిత యువకులు గ్రామ పెద్దలకు పిర్యాదు చెయ్యడం పంచాయతీలో తప్పుని చెప్పి క్షమాపణ చెప్పించి అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చెయ్యించారు. ఆరోజు అగ్రహించిన ఆధిపత్య అగ్రకులస్తులు జరిగే జాతరులల్లో మీ సంగతి చెబుతామని హెచ్చరిక చేశారు . ప్రమాదాన్ని పసిగట్టని దళిత యువకులు 29 వ తేదీ ఊరిలో జరుగుతున్న జాతరకు నలుగురు యువకులు వెళ్లారు . అదను కోసం ఎదురుచూస్తున్న అగ్రకుల కులదురహంకారులు బ్లేడ్ తో దాడులు చేశారు , వీరుకూడ ఆత్మ రక్షణ కోసం చేసిన క్రమంలో ఆధిపత్య అగ్రకులానికి చెందిన ఒక యువకుడికి పొట్ట పై తగిలింది . దీన్ని ఆసరా చేసుకున్న ఆధిపత్య అగ్రకుల పెత్తందార్లు గ్రామ యంపిటిసిలు , వైస్ సర్పంచ్ , మాజీ సర్పంచ్ ల ఆధ్వర్యాన సుమారు 300 మందికి పైగా రాత్రి 11 గంటల నుండి వేకువజాము 4 గంటల వరకు దారుణమైన దుర్మార్గమైన అటవిక దాడులు చేశారు . గోలకు బయటకొచ్చిన ఇరిగేషన్ ఉద్యోగి క్రిష్ణ కు శరీరం అంతా గాయాలు కావడం వల్ల 36 కుట్లు పడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు . ఒక యువకుడి మర్మాంగంపై బ్లేడ్ తో కోసారు. ఇంకా మరికొంత మంది యువకులు చికిత్స పొందుతున్నారు . ఆడవారి అని చూడకుండా జాకెట్లు , చీరలు చింపి భీభత్సం చేశారు . దళితులు 19 మందిని గుర్తించి పోలీసులకు పిర్యాదు చేస్తే వారిమీద ఎలాంటి చర్య తీసుకోలేదు . పైగా వారిలో ముఖ్యమైన ముద్దాయిలను శాంతి కమిటీలో పెట్టారు . ఆత్మ రక్షణ లో ఉన్న ఇద్దరు దళిత యువకులను అరెస్ట్ చేసి రిమాండ్ వేశారు . ఆధిపత్య అగ్రకుల కులదురహంకారులను ఒక్కరిని అరెస్ట్ చెయ్యలేదు. ఈ దుర్మార్గమైన కులదురహంకార దారుణమైన అటవిక దాడులకు పాల్పడిన పెత్తందార్ల పై కేసులు నమోదు చెయ్యాలి . అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి. దళితులకు రక్షణ కల్పించాలి . చట్టం బాధితులకు ఉందనే భరోసా ఇవ్వాలని అలాగే జిల్లా కలెక్టర్ ఎస్ పి. రాష్ట్ర హోం శాఖ మంత్రులు. ఎస్సీ కమిషన్ చైర్మన్ లు ఆ గ్రామాన్ని సందర్శన చేసి దళితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మారుతున్న రేషన్ కార్డు నిబంధనలు

విజయవాడ, మే 4, :రెండేండ్ల క్రితం కరోనా మహమ్మారి తీవ్ర స్థాయిలో ఉన్న సమయంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఉచిత రేషన్ అందించింది. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ రేషన్ విధానాన్ని అప్పట్లో అమలు చేసిన సంగతి తెలిసిందే. షనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్- 2013 కింద ఈ కార్డులను జారీ చేస్తారు. రేషన్ కార్డులనే ఫుడ్ సెక్యూరిటీ కార్డ్(ఈనీనీట రాజీటవబిఎ అజీతీట) అని కూడా పిలుస్తారు. కానీ.. పలువురు కార్డు దారులు రేషన్ కార్డు పొందేందుకు అనర్హులైనప్పటికీ రేషన్, ఇతర ఉచితాలనుఈ కార్డు ద్వారా పొందుతున్న విషయంపై కేంద్రం దృష్టి సారించింది. అనర్హులకు ఈ సౌకర్యాలు అందకుండా చూసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. అందువల్ల అనర్హులైన వారు తమ రేషన్ కార్డులను తక్షణం సరెండర్ చేయాలని ప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఒకవేళ అనర్హులైన కార్డుల యజమానులు తమ రేషన్ కార్డులను సరెండర్ చేయకపోతే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పింది.గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000 లోపు, నగరప్రాంతాల్లో రూ.2,00,000 లోపు వార్షిక ఆదాయం ఉన్నవారు రేషన్ కార్డులు పొందేందుకు అర్హులు. రూ.3.5 ఎకరాల లోపు పంటపొలాలు, రూ.7.5 ఎకరాల లోపు బీడు భూమి ఉన్నవారు కూడా రేషన్ కార్డు తీసుకోవచ్చు. ఈ తాజా నిబంధనల ప్రకారం.. రూ.10 వేల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారిని మాత్రమే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నకుటుంబాలుగా గుర్తించి కార్డు జారీ చేస్తారు. ఎల్లో రేషన్‌కార్డు పొందాలంటే.. కుటుంబంలో డాక్టర్, న్యాయవాది, ఆర్కిటెక్, చార్టర్డ్ అకౌంటెంట్ ఉండకూడదు. వార్షికాదాయం రూ.15 వేల వరకు ఉన్న కుటుంబాలు. ప్రొఫెషనల్ టాక్స్, సేల్స్ టాక్స్, ఇన్‌కమ్ టాక్స్ చెల్లించని కుటుంబాలు. రెసిడెన్షియల్‌లో ఫోన్, కారు, కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి రెండు హెక్టార్ల మెట్ట, హెక్టార్ మాగాణి, కరువు ప్రాంతాల్లో అర్ధ హెక్టార్ భూమి కూడా లేని వారిని మాత్రమే అర్హులుగా పరిగణిస్తారు.అర్హతలు లేకపోయినా రేషన్ కార్డు పొందినా, ఉపయోగించినా చట్టపరంగా చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అనర్హులు రేషన్ కార్డుల్ని ఉపయోగిస్తున్నట్లైతే ప్రభుత్వానికి సరెండర్ చేయాలి. 100 చదరపు మీటర్ల కంటే ఎక్కువ నిడివి గల ఇల్లు లేదా ఫ్లాట్, కారు లేదా ట్రాక్టర్, గ్రామంలో రూ.2 లక్షలకంటే ఎక్కువ వార్షికాదాయం, నగరాల్లో రూ.3 లక్షల కంటే ఎక్కువ వార్షికాదాయం గల వారు సంబంధిత తహసీల్దార్‌కు గానీ, డీఎస్‌వో ఆఫీసులో గానీ రేషన్ కార్డు సరెండర్ చేయాలి ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డ్ రూల్స్ చూస్తే అర్బన్ ప్రాంతాల్లో రూ.75,000 లోపు వార్షికాదాయం, గ్రామీణ ప్రాంతాల్లో రూ.60,000 లోపు వార్షికాదాయం ఉన్నవారు రేషన్ కార్డ్ తీసుకోవచ్చు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్నవారు కూడా రేషన్ కార్డ్ పొందడానికి అర్హులు. 100 చదరపు మీటర్ల ప్లాట్, ఇల్లు, ఫ్లాట్, ఫోర్ వీలర్, కార్, ట్రాక్టర్, రూ.2 లక్షల కన్నా ఎక్కువ వార్షికాదాయం ఉన్నవారికి రేషన్ కార్డ్ ఇవ్వరు. ఒకవేళ వారు రేషన్ కార్డ్ ఉపయోగిస్తున్నట్లైతే తహసీల్దార్ ఆఫీసులో సరెండర్ చేయాలి. డాక్టర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్ లాంటి ప్రొఫెషనల్స్ కూడా తమ దగ్గర రేషన్ కార్డ్ ఉంటే సరెండర్ చేయాలి. ప్రొఫెషనల్ ట్యాక్స్ పేయర్స్, సేల్స్ ట్యాక్స్ పేయర్స్, ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తున్నవారు కూడా రేషన్ కార్డ్ సరెండర్ చేయాల్సి ఉంటుంది. గతంలో రేషన్ కార్డ్ తీసుకున్నవారు ఆర్థికంగా స్థిరపడినట్లైతే.. వారు కూడా ఇప్పుడు రేషన్ కార్డును ప్రభుత్వానికి సరెండర్ చేయాల్సిందే.

# పార్స్ చంద్రగిరి నియోజకవర్గ డాక్టర్ల సంఘం అధ్యక్షులుగా యస్.రషీద్ మహ్మద్ నియామకం



మే,04 ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) చంద్రగిరి నియోజకవర్గ డాక్టర్ల సంఘం అధ్యక్షులు గా యస్. రషీద్ మహ్మద్ నియమితులయ్యారు. ఈ మేరకు చంద్రగిరి నియోజకవర్గ బహుజన డాక్టర్ల సంఘం అధ్యక్షులు గా యస్. రషీద్ మహ్మద్ ను వి.ద్వారకా బాబు నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. మీరు మీ పరిధిలొ రాజకీయ అవగాహన ముఖ్య నాయకులతో కమిటీలను నియమించడం తో పాటు బహుజన వాదాన్ని బలపరిచే వివిధ రంగాలలో పని చేస్తున్న వారిని పార్స్ అనుబంధ సంఘాలుగా మీ పరిధిలొ నియమించి, రెండు విభాగాల మధ్య సమన్వయ పరిచి వారందరి సహకారంతో బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సంధర్బంగా ఆయన పేర్కొన్నారు యస్. రషీద్ మహ్మద్ నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

# పార్స్ సూళూరుపేట అసెంబ్లీ అధ్యక్షులుగా కె.చంద్రహాస్ నియామకం



మే,04 ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) సూళూరుపేట అసెంబ్లీ అధ్యక్షులు గా కె. చంద్రహాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సూళూరుపేట అసెంబ్లీ అధ్యక్షులు గా కె. చంద్రహాస్ ను ఆంధ్రప్రదేశ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ డా. పి.పరమశివన్ నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. మీరు మీ పరిధిలొ రాజకీయ అవగాహన ముఖ్య నాయకులతో కమిటీలను నియమించడంతో పాటు బహుజన వాదాన్ని బలపరిచే వివిధ రంగాలలో పని చేస్తున్న వారిని పార్స్ అనుబంధ సంఘాలుగా మీ పరిధిలొ నియమించి, రెండు విభాగాల మధ్య సమన్వయ పరిచి వారందరి సహకారంతో బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సంధర్బంగా ఆయన పేర్కొన్నారు కె. చంద్రహాస్ నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

# మండుతున్న ఎండలు

ఒంగోలు, మే 4, :భానుడి భగభగలు నిప్పుల కొలిమిని తలపించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండాయి. వేడి తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో 44.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. అదే జిల్లా చందర్లపాడు, కంచికచర్లలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అనేక ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నందలూరు, పెనగలూరు, చిట్వేల్, ప్రకాశం జిల్లా దోర్నాలలో 43.4 డిగ్రీలు, కర్నూలు జిల్లా కల్లూరు, వెల్దుర్తి, నెల్లూరు జిల్లా గూడూరు, తిరుపతి అర్బన్‌లో 43.1 డిగ్రీలు, కర్నూలు, కృష్ణా జిల్లా తిరువూరు, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం, పుల్లల చెరువు, ముండ్లమూరులో 43 డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, రాజమండ్రి, గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో 42.9 డిగ్రీలు, చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురంలో 42.8, కర్నూలు జిల్లా పాణ్యం, బనగానపల్లె, ప్రకాశం జిల్లా మార్కాపురంలో 42.6, పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం, తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేట, కిర్లంపూడి, ప్రకాశం జిల్లా తర్లపాడులో 42.5, చిత్తూరు జిల్లా చిత్తూరు, గుడిపలలో 42 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో 670 మండలాలు ఉండగా.. 514 మండలాల్లో సోమవారం బాగా వేడి వాతావరణం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. 152 మండలాల్లో మాత్రం తీవ్రమైన వేడి గాలులు ఉన్నట్లు పేర్కొంది. నెల్లూరు, వైఎస్సార్, తిరుపతి, ప్రకాశం, పల్నాడు, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని ఎక్కువ మండలాల్లో ఎండ ప్రభావం అధికంగా ఉంది. రాయలసీమ జిల్లాల్లో ఎక్కువ ప్రాంతాల్లో ఎండ వేడి, ఉక్కపోత వాతావరణంలో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మంగళ, బుధవారాలు కూడా ఇదే తరహా వాతావరణం ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు బంగాళాఖాతంలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో చిత్తూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. విశాఖ ఏజెన్సీలోనూ అక్కడక్కడా జల్లులు పడ్డాయి.

# వైఎస్సార్‌సీపీ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే పేర్ని నాని



మచిలీపట్నం : మే 4, 2022 ప్రజాపాలన :వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 7 వ తేదీ , 8 వ తేదీన గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రివర్యులు, మచిలీపట్నం శాసన సభ్యులు, వైఎస్సార్‌సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షులు పేర్ని వెంకట్రామయ్య ( నాని ) తెలిపారు. బుధవారం ఉదయం ఆయన తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మెగా జాబ్ మేళా గురించి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల భారీ జాబ్ మేళాలు నిర్వహిస్తున్న విషయం అందరికి విదితమేనని అన్నారు. తాజాగా మరో భారీ జాబ్ మేళా గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 7, 8వ తేదీల్లో వైఎస్సార్ సీపీ మెగా జాబ్ మేళా జరుగుతుందని అందులో పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న వారికి ఉద్యోగాలిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ ను ఎమ్మెల్యే పేర్ని నాని ఆవిష్కరించారు. ఇప్పటికి మన రాష్ట్రంలో విశాఖపట్నం, తిరుపతిలో జరిగిన రెండు మెగా జాబ్ మేళా విజయవంతం అయ్యాయని ఆ రెండు ప్రాంతాలలో సుమారు 30 వేలమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించబడినట్లు ఆయన వివరించారు.మే 7 వ తేదీ , 8 వ తేదీన గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే మెగా జాబ్ మేళాలో జాబ్‌మేళాలో 80 కంపెనీలు పాల్గొంటున్నాయని మన ప్రాంతంలోని నిరుద్యోగ యువత ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ జాబ్ మేళాలో హెచ్ సి ఎల్, హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు , హీరో , హెటేరో, అపోలో ఫార్మసి, అవని టెక్నాలజీ సొల్యూషన్స్ , ఆక్సిస్ బ్యాంకు, భరత్ ఎఫ్ ఐ హెచ్ , బిగ్ బాస్కెట్ , బైజూస్ , సెరియం కోజెంట్ , డిక్సన్ తదితర సంస్థల్లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. అయితే ఈ జాబ్ మేళాకు బాపట్ల, ఏలూరు, గుంటూరు, మచిలీపట్నం, నర్సారావుపేట, నర్సాపురం, విజయవాడ, రాజమండ్రి, ఒంగోలు చెందిన నిరుద్యోగులు మాత్రమే హాజరుకావాల్సి ఉందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మొదటగా అధికారిక వెబ్ సైట్ https://ysrcpjobmela.com/ ను ఓపెన్ చేయాలి. అనంతరం Apply Now ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత పేరు, ఫోన్ నంబర్, మెయిల్ ఐడీ, పార్లమెంట్ నియోజకవర్గం, విద్యార్హత, ఫుల్ అడ్రస్ ను నమోదు చేసి Apply Now ఆప్షన్ పై క్లిక్ చేయాలని ఎమ్మెల్యే పేర్ని నాని వివరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మచిలీపట్నం మాజీ జడ్పిటీసీ సభ్యులు లంకె వెంకటేశ్వరరావు ( ఎల్వియార్ ) , మాడపాటి వెంకటేశ్వరరావు, శీలం బాబ్జి, శౌంతి ఫరీద్, మహమ్మద్ రఫీ, కో– ఆప్షన్ సబ్యుడు బేతపూడి రవి, మరీదు నాగరాజు, తిరుమలశెట్టి ప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మణ్, వైస్సార్ సి పి సోషల్ మీడియా ప్రతినిధులు పుప్పాల పవన్, అంబటి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంకెన్నాళ్ళు జగన్ రెడ్డి.. మాకు ఈ బాదుడు



రాజుపాలెం ప్రజాపాలన : రాష్ట్రంలో సామాన్యుడు బ్రతకాలంటే చాలా కష్టంగా ఉందని ప్రతి దాంట్లో కూడా సామాన్యులపై పెనుభారం పడుతుందంటూ తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులు డాక్టర్ కోడెల శివరాం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న బాదుడే బాదుడు కార్యక్రమాన్ని మంగళవారం తెలుగు యువత ఆధ్వర్యంలో లిరాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామం లోలి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులు డాక్టర్ కోడెల శివరాం ముందుగా గ్రామంలో కొవ్వొత్తులు, కాగడాలు తో నిరసన ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ వైఖరిని ప్రజలకు వివరించారు. రాక్షస పాలన అతి త్వరలోనే పోతుందని రాబోయేది మాత్రం చంద్రన్న సువర్ణ పాలన అనీ వారిలో భరోసా నింపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు.



చిలకలూరిపేట పురుషోత్తమపట్నంలోని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రివర్యులు శ్రీమతి విడదల రజిని నివాసానికి వారి ఆహ్వానం మేరకు విచ్చేసిన పల్నాడు జిల్లా ఇంచార్జ్‌గా మంత్రి మరియు రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రివర్యులు శ్రీ కారుమూరి వెంకట నాగేశ్వరరావు.

## కృష్ణ విశ్వవిద్యాలయ రెక్టార్‌గా దారపురెడ్డి సూర్యచంద్ర రావు నియామకం



మచిలీపట్నం : మే 4, 2022 ప్రజాపాలన :ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్ర రావు కృష్ణ విశ్వవిద్యాలయ రెక్టర్ గా నియమిస్తూ కృష్ణ విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏప్రిల్ 26 వ తేదీన నిర్ణయం తీసుకొంది. కృష్ణ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే బి చంద్ర శేఖర్ చేతులమీదుగా నియామకపు ఉత్తర్వులను బుధవారం అందుకోవడం జరిగింది.ఆచార్య సూర్యచంద్ర రావు రెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఆచార్య సూర్యచంద్ర రావు ప్రస్తుతం డిపార్ట్మెంట్ అఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మానేజ్మెంట్ లో ప్రొఫెసర్ గా కొనసాగుతున్నారు. ఫాకల్టీ అఫ్ కామర్స్ అండ్ మానేజ్మెంట్ కి డీన్ గాను, కామర్స్ అండ్ మానేజ్మెంట్ బోర్డు అఫ్ స్టడీస్ కి చైర్మన్ గా కూడా వ్యవహరిస్తున్నారు. వీటితో పాటుగా యూనివర్సిటీ కాలేజీ అఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ గా కూడా వ్యవహరిస్తన్నారు. ఆచార్య సూర్యచంద్ర రావు టీచింగ్ , రీసెర్చ్ లో తమ ప్రజ్ఞ పాటవాలను చాటుకోవడమే గాక, యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్నారు. రాష్ట్రము లోనే దీర్ఘ కాలం పనిచేసిన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ గ గుర్తింపు తెచ్చుకోవడమే గాక, కృష్ణ విశ్వవిద్యాలయ ఇంచార్జి ఉపకులపతి గా కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్స్, ఫైనాన్స్ ఆఫీసర్, కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్, ఎన్ ఎస్ ఎస్ విశ్వవిద్యాలయ ప్రోగ్రాము కోఆర్డినేటర్ గా కూడా పనిచేసిన అనుభవం వుంది. సూర్యచంద్ర రావు కొంతకాలం నూజివీడు ఐఐఐటీ డైరెక్టర్ గ కూడా తమ సేవలను రాజీవ్ గాంధీ యూనివర్సిటీ అఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ అందించడం జరిగింది. ప్రస్తుతం ఈయన రాష్ట్ర స్థాయి ఆన్లైన్ డిగ్రీ అడ్మిషన్స్ కన్వీనర్ గ కూడా వ్యవహరిస్తున్నారు. ఆచార్య సూర్యచంద్ర రావు ను రెక్టార్ గ నియమిచడం పట్ల ఉపకులపతి ఆచార్య కే బి చంద్ర శేఖర్ బీ రిజిస్ట్రార్ రామి రెడ్డి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తమ అభినందనలు తెలియజేసారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన సరుకులు ఇవ్వాలి:అచంట సునిత



మచిలీపట్నం: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు మచిలీపట్నంలోని బుధవారం పలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి చిన్నారులతో కాసేపు ముచ్చటించాను. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులను పరిశీలించారు జొన్నపిండిలో ఇసుక, బూజు పట్టిన బెల్లం, మురిగిపోయిన కోడిగుడ్లు వంటివి సరఫరా చేస్తున్నారని వర్కర్లు ఆమె దృష్టికి తీసుకొచ్చారాని అన్నారు పిల్లలకు, గర్భిణిలకు ఇచ్చే పాలు కూడా కాగబెట్టగానే విరిగిపోతున్నాయని చెప్పారు. ఈ సమస్యలన్నింటిపై దృష్టిపెట్టి, నాణ్యమైన సరుకులను అంగన్వాడీలకు అందించాలని డీఆర్ఓను కలిసి సహచర నేతలతో వినతిపత్రం అందించాను.

## పాత ఇండ్ల రిపేర్ లకు నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలిజిబెత్ రాణి



గన్నవరం ప్రజాపాలన ప్రతినిధి మే04: జిల్లా గిరిజన అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డి టి డబ్ల్యూ ఓ గండయ్య ఈ రోజు గన్నవరం మండలం వీరపనేనిగూడెం గ్రామ లంబాడి తండా కాలానికి పరిశీలన కొరకు వచ్చారు నెలరోజుల క్రితం గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి ఈ కాలనీ పర్యటనకు వెళ్లిన సందర్భంలో 1988లో కట్టటంతో ఎక్కువ ఇండ్లు సిదిలావస్థలో ఉండి వర్షాలకు ఇండ్లు తడిసిపోతున్నాయి అని చూపించగా అటువంటి వారి వారివద్దా నుండి అర్జీలు తీసుకొని ప్రస్తుత వైస్సార్ జగన్ మోహనరెడ్డి ప్రభుత్వం పాత ఇండ్లకు రిపేర్లకు నిధులు మంజూరు చేయమని గన్నవరం శాసనసభ్యులు వంశీమోహన్ ద్వారా జిల్లా కలెక్టర్ కి జడ్పీటీసీ అర్జీలు ఇవ్వగా జిల్లా కలెక్టర్ ఈ సంస్థ అధికారులు ను పంపించారు. అని తెలిపారు ఈ సందర్భంగా కలెక్టర్ ధన్యవాదములు అని జడ్పీటీసీ తెలిపారు పరిశీలనకు వచ్చిన అధికారులును జడ్పీటీసీ తో పాటు గ్రామ సర్పంచ్ ఆరెపల్లి జేజమ్మ ఎంపీటీసీ నందిపాటి పద్మ వార్డ్ సభ్యులు అన్ని ఇండ్లు చూపించారు. వారు జిల్లా కలెక్టర్ కి నివేదికలు ఇస్తామని చెప్పి వెంటనే ఇంజనీర్లతో ఏస్ట్ మెంట్ వేయించి రిపేర్లు చేయిస్తామని చెప్పారు గత 20 రోజుల క్రితం గన్నవరం ఎంపీపీ అనగాని రవి తీసుకువెళ్లి చూపించానని అన్నవరపు ఎలిజిబెత్ రాణి తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ వైస్సార్సీపీ నాయుకులు నందిపాటి సుబ్బారెడ్డి ఆరెపల్లి వెంకటేశ్వరావు ఫకీర్ నాయుక్ కోటనాయుక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ విజయ దుర్గా దేవి నూతన ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న చందన్ నాగేశ్వర్



రాజమండ్రి రూరల్ : ప్రజాపాలన ప్రతినిధి: రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కడియం మండలం పొట్టిలంక గ్రామంలో పవిత్ర గోదావరి తీరం నందు నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ విజయ దుర్గా దేవి నూతన ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ కో ఆర్డనేటర్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. వేద పండితుల చందన నాగేశ్వర్ కి స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. శ్రీ విజయ దుర్గా దేవి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో నన్ను భాగస్వామిని చేసినందుకు చాలా ఆనందకరంగా ఉందని ఇంతటి చక్కటి ఆలయ నిర్మాణము చెప్పటిన పొట్టిలంక శ్రీ విజయదుర్గాదేవి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు, శాప్ డైరక్టర్ భిమిరెడ్డి నాగేంద్ర, పొట్టిలంక గ్రామ సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసు, కలవింద్ గోవింద్ విశాలాక్షి, ఆలయ కమిటీ సభ్యులు కామిరెడ్డి గోవింద్, తోరాటి మల్లేశ్వరరావు, అన్నందేవుల రాములు, భిమిరెడ్డి రామక్రిష్ణ, గట్టి గంగాధర్ పాల్గొన్నారు.


"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ | Rs 5000/- |
| 13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, | Rs 5000/- |
| 14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ | Rs 2000/- |
| 15. రత్నశ్రీ పార్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ | Rs 2000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.


## స్థానిక సమస్యలపై రూరల్ బిజెపి స్పందన



రాజమహేంద్రవరం రూరల్: ప్రజాపాలన ప్రతినిధి: పారిశుద్ధ్య సమస్యలపై క్షేత్రస్థాయిలో రాజమండ్రి రూరల్ బిజెపి నాయకులు పర్యటించి రూరల్ ప్రత్యేక అధికారిణి ఈఓపిఆర్ అండ్ ఆర్డీ కి వినతి పత్రం అందజేశారు. రూరల్ మండల అధ్యక్షులు యానాపు ఏసు, జిల్లా కార్యదర్శితనుబుద్ధి సూర్య భాస్కర్, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి ఎన్.వి.బి.ఎన్.ఆచారి, మండల ఉపాధ్యక్షులు అల్లంగిఅనిల్, పట్నాల నాగార్జున, స్థానిక బాధితులు పాల్గొన్నారు. రాజమండ్రి రూరల్ మండలం లో ప్రత్యేక అధికారి పరిపాలనలో ప్రజలు అనేకానేక ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ మరీ అధ్వానంగా ఉందని, ప్రతీ గ్రామంలో ఏదో ఒక సమస్య ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా రాజవోలు గ్రామం సరిహద్దులో రహదారిని ఆనుకుని ఉన్న మంచినీటి సరఫరా పైప్లైన్ చెడిపోయి ఎంతో విలువైన గోదావరి త్రాగునీరు వృధాగా పోతోందని, పైగా ఆ నీరు రహదారిపై ప్రవహించి రోడ్లు చిద్రమౌతున్నాయని, ఫలితంగా ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. అలాగే హుకుంపేట పంచాయతీ నాగిరెడ్డి నగర్ మూడు గుళ్లు పరిసర ప్రాంతాలలో మురుగు నీటి నిర్వహణ అధ్వానంగా తయారయ్యి రోడ్డుపైన నెలల తరబడి మురుగునీరు నిలువ ఉండటం వలన పరిసర ప్రాంత ప్రజలు రాకపోకలకు అసౌకర్యం కలగడమే కాకుండా స్థానిక ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. ఇవన్నీ ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ వహించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాజమండ్రి రూరల్ మండలం భారతీయ జనతా పార్టీ ప్రజల తరఫున ప్రజల కొరకు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉద్యమిస్తామని ప్రకటించారు.

ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 05, మే 2022

# జగన్ సర్కార్‌కు పెన్షన్ పరీక్ష

నూతన పెన్షన్ స్కీం రద్దు చేయాలని రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పోరాడుతున్నారు. సిపిఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) అని పిలిచే దీనిని తాము అధికారంలోనికి వచ్చిన వారం రోజుల్లో రద్దు చేస్తామని జగన్ మోహన్ రెడ్డి 2019 ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. తమ ఎన్నికల ప్రణాళికలో కూడా ఇదే పేర్కొన్నారు. మూడేళ్లు గడిచినా నేటికీ ఆ పని చేయలేదు సరికదా, ఏదో అవగాహన లేకుండా అలా హామీ ఇచ్చామని, దీన్ని రద్దు చేయడం సాధ్యం కాదని ఇప్పుడు సెలవిస్తున్నారు. ప్రభుత్వ వైఖరి పట్ల ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనితో రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీడ్ పెన్షన్ స్కీం (జిపిఎస్) అనే కొత్త పల్లవి ఎత్తుకుంది. దీనిని సంఘాలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. భారీ ప్రకటనలు ఇస్తోంది. పోనీ వాటిలోనైనా వాస్తవాలు చెబుతోందా అంటే అదీ లేదు. ఉదాహరణకు పెన్షన్ తక్కువరావడానికి కారణం వడ్డీరేట్లని తెలిపింది. కానీ వాస్తవమేమిటంటే ఆ నిధులతో షేర్ మార్కెట్లో జూదమాడడమే ప్రధాన కారణం. దీనిని ప్రభుత్వం మరుగునపరిచి, ఆలోచించమని ఉద్యోగులకు నేరుగా విజ్ఞప్తి చేస్తోంది. సమాజానికి పాఠాలు నేర్పే గురువులు ఆ మాత్రం ఆలోచించలేని స్థితిలో ఉన్నారనుకోవడం అవివేకమే. మరి ఇక మిగిలిన ఏకైక పరిష్కారం దీనిని రద్దు చేసి, పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించడమే. అది ఎలాగన్నదే అసలు సమస్య. ఇది తెలియాలంటే దీని మూలాలలోనికి వెళ్ళవలసిందే. 2003 అక్టోబరు 10న కేంద్రంలోని నాటి వాజపేయి ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు ద్వారా అప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకున్న పెన్షన్ స్కీం స్థానంలో నేషనల్ పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్) అనే దానిని ప్రవేశపెట్టింది. దీనికనుగుణంగా ప్రభుత్వం పిఎఫ్‌ఆర్డీఏ (పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటి) చట్టాన్ని చేసింది. 2014 జనవరి 1 తరువాత ఆర్మీ సర్వీసులు మినహా మిగిలిన కేంద్ర ప్రభుత్వ డిపార్టుమెంట్లలో చేరిన ప్రతి ఉద్యోగికీ, తప్పనిసరిగా ఇది వర్తించేలా నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ప్రకారం ఉద్యోగి జీతం నుంచి 10 శాతం, యాజమాన్యం నుంచి 10 శాతంతో పెన్షన్ నిధిని ఏర్పాటు చేస్తారు. నిర్వహణ కోసం ఒక ట్రస్టును ఏర్పాటు చేసి, ప్రవేట్ సంస్థలతో కూడిన ఒక కన్సార్టియం సారథ్యంలో నిధులను షేర్ మార్కెట్లో పెట్టుబడిగా పెడతారు. పెన్షన్ చెల్లించే రోజుకు షేర్ మార్కెట్ విలువను బట్టి ఎంత పెన్షన్ ఇవ్వాలనేది నిర్ణయిస్తారు. ఈ చట్టానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే 2003లో ఆర్డినెన్సు ద్వారా అమలు ప్రారంభమైన పదేళ్ళు అంటే 2013కు గాని ఇది చట్ట రూపం తీసుకోలేదు. ఇదే చట్టం సెక్షన్ 12(4)లో ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం గాని, కేంద్ర పాలిత ప్రాంతంగాని దీనిలో చేరవచ్చని పేర్కొన్నారు. ఇది ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం మీదే ఆధారపడి ఉంటుంది. సెక్షన్ 12(5) ద్వారా మిగిలిన ఏ సంస్థనైనా దీనిలో చేర్చే అధికారం కేంద్ర ప్రభుత్వానికుంది. ఈ అధికారం ద్వారానే ఎల్ఐసి, బ్యాంకులు వంటి సంస్థలలో 2010 తరువాత చేరిన ఉద్యోగులందరికి దీనిని వర్తింపచేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో దీనిలో చేరడానికి నిర్ణయించడంతో మన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇది 2004 సెప్టెంబరు 1 నుంచి అమలవుతోంది. అంటే అంతకు ముందు వారందరికీ పాత పెన్షన్ విధానం, తరువాత చేరిన వారికి ఈ పెన్షన్ విధానం, అలా ఒకే యాజమాన్యంలో పనిచేస్తున్న వారికి వేర్వేరు పెన్షన్ విధానాలు అమలుకావడం ప్రారంభమయింది. పాతదానికి, కొత్తదానికి ప్రధానమైన తేడా ఏమిటంటే పాత పెన్షన్ స్కీంలో ఉద్యోగికి ఎంత పెన్షన్ వస్తుందో గ్యారంటీ చేస్తే, కొత్త పెన్షన్ స్కీంలో ఉద్యోగి దీనికి ఎంత చెల్లించాలో నిర్దేశించారు, కానీ పెన్షన్ ఎంత వస్తుందో గ్యారంటీ మాత్రం చేయలేదు. ఇదే ఇందులోని ప్రధాన లోపం.

ఈ పెన్షన్ స్కీం చాలా నష్టకరమని కొన్ని పార్టీలు, ముఖ్యంగా వామపక్ష పార్టీలు దీనిని ఆది నుండీ వ్యతిరేకిస్తూ వచ్చాయి. వాస్తవంగా వీరి వ్యతిరేకత వల్లే ఇది పదేళ్ళపాటు చట్ట రూపం కూడా తీసుకోలేదు. వామపక్షాలు కేవలం పార్లమెంటులో వ్యతిరేకతతోనే సరిపెట్టకుండా, తాము అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో దీనిలో చేరడానికి నిరాకరించాయి. అందువల్లే దేశంలో మిగిలిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ కొత్త పెన్షన్ అమలయితే ఈ మూడు రాష్ట్రాలలోనూ మాత్రం పాత పెన్షనే అమలవుతూ వచ్చింది. అయితే కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం 2013లో దీనిలో చేరిపోయింది. త్రిపురలో 2018లో అధికారంలోనికి వచ్చిన బిజెపి ప్రభుత్వం దీనిలో తన ఉద్యోగులను చేర్చేసింది. ఇక నేడు దీనిలో చేరకుండా ఉన్న ఏకైక రాష్ట్రం పశ్చిమ బెంగాల్ మాత్రమే. కొంతమంది భావిస్తున్నట్లు పాత పెన్షన్ విధానం కూడా ఊరికే ప్రభుత్వమేమీ తన స్వంత నిధులతోనే ఉద్యోగులకు ఇవ్వడం లేదు. ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) నిబంధనల ప్రకారం ప్రకారం ఉద్యోగి తన జీతం నుంచి ఎంత పిఎఫ్ జమ చేస్తాడో అంతే మొత్తంలో ఆ ఉద్యోగి పిఎఫ్ ఖాతాకు యజమాని కూడా చెల్లించాలి. ఇప్పుడు ఉద్యోగి తన జీతంలో 10 శాతం చెల్లిస్తున్నాడు. ప్రభుత్వం తాను చెల్లించవలసిన 10 శాతాన్ని మినహాయించి, ఆ సొమ్ముతో ఉద్యోగికి పెన్షన్ పాత విధానంలో చెల్లిస్తోంది. అందువల్ల పాత పెన్షన్ స్కీం కూడా వాస్తవంగా ప్రభుత్వానికి భారమేమీ కాదు. ఎందువల్లంటే ఉద్యోగి సర్వీసు కాలమంతా తన వద్దే ఆ సొమ్మును అట్టే పెట్టుకుని, ఉద్యోగి రిటైర్ అయిన తరువాత మాత్రమే నెలకు ఇంత చొప్పున ప్రభుత్వం పెన్షన్ రూపంలో చెల్లిస్తోంది. ఇక కొత్త పెన్షన్ విధానమయితే ఉద్యోగి జీతం నుండి పెన్షన్ నిధికి నెలకు 10 శాతం చెల్లిస్తే, యాజమాన్యం కూడా అంతకంటే తగ్గకుండా చెల్లించాలి. అంటే గత పెన్షన్ నిధి కేవలం యాజమాన్యం 10 శాతం వాటాతో నడిస్తే, నేడు ఉద్యోగి వాటా కూడా కలుపుకుని దీనికి కనీసం రెట్టింపు నిధులు సమకూరుతున్నాయి. దీనర్థం పై లెక్క ప్రకారం చూస్తే, 30 ఏళ్లలో పెన్షన్ నిధి రెట్టింపుగా 90 లక్షల రూపాయలవుతుంది. ఈ నిధి నుండి ఉద్యోగికి రెట్టింపు పెన్షన్ చెల్లించినా ప్రభుత్వానికేమీ నష్టం ఉండదు. కానీ ఇప్పుడు ఎంత చెల్లిస్తారో కూడా గ్యారంటీ లేదు. మార్చి 2022 నాటికి ఈ ఎన్‌పిఎస్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 23 లక్షల మంది, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు 56 లక్షల మంది ఉన్నారు. వీరు నెలవారీ చెల్లించిన నిధులు కూడా భారీ స్థాయిలో 7లక్షల కోట్ల రూపాయలకు పైగా ఈ ట్రస్టు వద్ద ఉన్నాయి. ఈ నిధులను షేర్ మార్కెట్లో ఎలా పెట్టుబడి పెట్టాలనేది నిర్ణయించడానికి ప్రభుత్వం రిలయన్స్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్, ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి వంటి కార్పొరేట్ సంస్థలతోనే పెన్షన్ ఫండ్ మేనేజర్స్‌ను నియమించింది. వారు సహజంగానే తమ కంపెనీల లాభాలకే ప్రాధాన్యమిస్తారు గానీ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడతారా? అందువల్ల ఈ నూతన పెన్షన్ విధానం ఉద్యోగుల కష్టార్జితాన్ని కార్పొరేట్ సంస్థలు కొల్లగొట్టుకుపోవడం తప్ప మరొకటి కాదు. ఉద్యోగి తన పదవీ విరమణ తరువాత గౌరవప్రదమైన జీవనం సాగించడానికి, పెన్షన్ రాజ్యాంగపర హక్కు అని దేశ సర్వోన్నత న్యాయస్థానం అనేక తీర్పులలో పేర్కొంది. అయితే ఈ హక్కును కాలరాసేలా నేటి ఎన్‌పిఎస్ ఉంది. ఇటువంటి ముదనష్టపు స్కీం నుంచి బయటపడి, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడానికి ఇటీవల రాజస్థాన్, కేరళ, డిల్లీ, తమిళనాడు వంటి కొన్ని బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొస్తున్నాయి. ఇటువంటి నిర్ణయాలు కార్పొరేట్ సేవలో మునిగి తేలుతున్న కేంద్ర ప్రభుత్వానికి ఇంపుగా లేకపోవచ్చేమో గాని, ఉద్యోగులకు మాత్రం గొప్ప వరంగానే మారుతాయి. అదే చట్టం సెక్షన్ 12(3)(సి) ద్వారా కొన్ని స్వతంత్ర పెన్షన్ స్కీంలను ఈ చట్ట పరిధి నుంచి కేంద్ర ప్రభుత్వం మినహాయించవచ్చు. కానీ జగన్ ప్రభుత్వం ఎందుకు మీన మేషాలు లెక్కిస్తోందో అర్థం కాని విషయమే. సమస్యను ఇప్పటికీ అవగాహన చేసుకోకుండా, గట్టిగా అడుగుతున్న ఉద్యోగులపై నిర్బంధం ప్రయోగించడం మొరటు పద్ధతిలో వ్యవహరించడం తప్ప ఇంకేమనుకోగలం? దానికి బదులుగా ఈ స్కీం నుండి బయటకురావాలని ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి ఉమ్మడిగా నడవడమే తెలివైన పని. నిర్బంధం వీడి, ఇంకేమాత్రం కాలయాపన లేకుండా సరైన పంథా అవలంభించడమే వివేకం అనుపించుకుంటుంది. అటువంటి విజ్ఞత జగన్ ప్రభుత్వం ప్రదర్శిస్తుందా? లేదా? అన్నది వేచి చూడవలసిందే.

# అమృత కాలం సరే, వర్తమానం మాటేమిటి?




భారతదేశం అభివృద్ధిలో వెలిగిపోతోందని, టెక్నాలజీ, స్టార్టప్‌ల విప్లవం నడుస్తోందని, రానున్న 25ఏళ్ల అమృత్ కాలంలో సమయాన్ని సద్వినియోగం చేసుకుని దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల ఎక్కడకు వెళ్లినా చెప్పుతున్నారు. జర్మనీలో భారతీయుల ముందు కూడా ఆయన ఇవే మనోభావాలను వ్యక్తం చేశారు. పనిలో పనిగా కాంగ్రెస్ హయాంలో దళారీలే ప్రజలకు చేరాల్సిన నిధులలో అత్యధిక మొత్తాన్ని కబళించేవారని పరోక్షంగా ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు. స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తయిన రీత్యా రానున్న పాతికేళ్ల కాలంలో సాధించాల్సిన లక్ష్యాలను ప్రధానమంత్రి స్వయంగా ఉల్లేఖించి, అందుకు తగ్గట్లుగా పనిచేయాలని ప్రోత్సహించడం ఆహ్వానించదగిన విషయమే. అయితే నిజంగా మనం అమృత్ కాలానికి తగ్గట్లుగా పనిచేసేందుకు సన్నద్ధంగా ఉన్నామా, అందుకు మనం ఎదుర్కోవాల్సిన సవాళ్లేమిటి అన్న విషయం చర్చించవలిసి ఉంటుంది. కొవిడ్‌తో సంభవించిన ఆర్థిక నష్టాలను భర్తీ చేసుకునేందుకే భారతదేశానికి దాదాపు 12 సంవత్సరాలు పడుతుందని, గత మూడేళ్లలో రూ. 50 లక్షల కోట్లు కోల్పోయామని భారతీయ రిజర్వ్ బ్యాంకు తాజా నివేదిక స్పష్టం చేసిన రీత్యా మోదీ ప్రకటించిన అమృత్ కాలంలో దాదాపు సగం సమయం ఈ నష్టాల భర్తీకే పడుతుందని మనం గ్రహించక తప్పదు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న దుర్భర పరిస్థితికి అనేక కారణాలున్నాయి. పెద్ద నోట్ల రద్దు, కొవిడ్ మహమ్మారి, ప్రభుత్వ ఆర్థిక విధానాల నుంచి, ఉక్రెయిన్‌పై రష్యా దాడి వంటి అంతర్జాతీయ పరిణామాల వరకూ ఎన్నో కారణాలు ఉన్నాయి. ఇవాళ అన్నిటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగం. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) తాజా నివేదిక ప్రకారం దాదాపు 45 కోట్ల మంది నిరుద్యోగులు సరైన ఉద్యోగావకాశాలు లేక తల్లడిల్లిపోతున్నారు. దేశంలో 85 శాతం కార్మికులు అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నందువల్ల ఎన్ని కోట్ల మంది ఉపాధి కోల్పోయారో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. మౌలిక ప్రజా సేవల రంగంలో కూడా ఉపాధ్యాయులు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత కొట్టొచ్చినట్లు కనపడుతోంది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం చూస్తే మన దేశంలో విద్యార్థులు టీచర్లు, వైద్య సిబ్బంది రోగుల నిష్పత్తి ఎంతో తక్కువ. ప్రతి ఐదుగురు కాలేజీ గ్రాడ్యుయేట్లలో ఒక్కరు నిరుద్యోగిగా మిగిలిపోతున్నారని సిఎంఐఇ తెలిపింది. గత ఏడాది భారతీయ రైల్వేలో 35వేల గుమాస్తా ఉద్యోగాల కోసం కోటీ 20లక్షల మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. ఏప్రిల్ డేటా ప్రకారం పట్టణాల్లో నిరుద్యోగ శాతం 9.22 ఉంటే, గ్రామాల్లో అది 7.29 శాతానికి చేరుకున్నదని తెలిపింది. గ్రామీణ ఉపాధి పథకం క్రింద నమోదు చేసుకున్న వారిలో సగం మంది మాత్రమే క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. సంవత్సరానికి 80రోజుల పని లభించిన కుటుంబాలు కేవలం 6శాతం మాత్రమేనని గణాంక వివరాలు చెబుతున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా ఒక ఆందోళనకరమైన పరిణామం మన దేశంలో నెలకొంటోంది. ఉద్యోగాలు దొరుకుతాయన్న నమ్మకం లేక లక్షలాది మంది భారతీయులు, ముఖ్యంగా మహిళలు పనికోసం వెతుక్కోవడమే మానేశారని ఒక అంచనా. ఇలాంటి వారి సంఖ్య రోజురోజుకూ పెరగడం ఆర్థిక, సామాజిక సంక్షోభానికి సూచికగా నిపుణులు భావిస్తున్నారు. గత అయిదేళ్లలో వీరి సంఖ్య 40 నుంచి 46 శాతానికి పెరిగింది. ప్రతి రోజూ యువకులు కూలీపనుల కోసం, ఉద్యోగాల కోసం ముందుకు వస్తున్నా వారికి ఉద్యోగాలు కల్పించే స్థితి దేశంలో లేదని, ఒక దశ తర్వాత వారు పనికోసం అన్వేషించడం కూడా మానుకుంటారని అంటున్నారు. ఏటా దాదాపు 50లక్షల మంది చదువుకున్న యువత ఉద్యోగాలు అన్వేషిస్తోందని, కాని వారికి ఉద్యోగాలిచ్చేవారే లేరని తెలుస్తోంది. కరోనా సమయంలో టైలరింగ్, బ్యూటీపార్లర్లు, స్టేషనరీ షాపులు వంటి అనేక చిన్న, సూక్ష్మ మధ్య తరహా సంస్థలు మూతపడ్డాయి. యువతుల్లో సగం మంది పని దొరకని వారో, లేక పనికోసం వెతుక్కోకుండా ఉండిపోయిన వారో ఉన్నారు. సిఎంఐఇ డేటా ప్రకారం వ్యవసాయేతర ఉద్యోగాలు 2022 మార్చి నాటికి కోటీ 67 లక్షలు పడిపోగా, వ్యవసాయంలో పనిచేసే వారు కోటీ 53లక్షల మంది పెరిగారు. ప్రభుత్వం ఇచ్చే రేషనే లేకపోతే నిరుద్యోగం అగ్ని పర్వతంలా బద్దలయేదని అనే వారు కూడా ఉన్నారు. దేశంలో 80కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలను సరఫరా చేస్తున్నామని ప్రభుత్వమే చెప్పుకుంటోంది. అసలు ఇంత పెద్ద స్థాయిలో ప్రజలు తిండిగింజల కోసం చేయిచాచవలసిన పరిస్థితి ఎందుకు వచ్చింది? వ్యవసాయ సంక్షోభమూ విస్మరించదగిన పరిస్థితిలో లేదు. జాతీయ క్రైమ్ రికార్డు బ్యూరో ప్రకారం రైతుల ఆత్మహత్యలూ పెరుగుతున్నాయి. తాజాగా పంజాబ్‌లో అప్పులు, పంటల వైఫల్యం వల్ల ఒకే నెలలో 15మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పెరుగుతున్న ఇంధన, ఎరువుల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులు, మధ్యతరగతి జీవనాన్ని దుర్భరంగా మార్చివేశాయనడంలో సందేహం లేదు. రిటైల్ ద్రవ్యోల్బణం 7 శాతానికి చేరుకుంటే టోకు ధరల ద్రవ్యోల్బణం 15 శాతం మేరకు ఉంటుందని ఆర్థిక నిపుణుల అంచనా. తాను తన జీవితంలో ఈ స్థాయిలో ద్రవ్యోల్బణం ఏనాడూ చూడలేదని, ఇది ప్రభుత్వానికి హెచ్చరిక అని దేశంలో వేగంగా కొనుగోలు చేసే వినియోగ వస్తువుల గ్రూపు (ఎఫ్‌ఎంసిజి) హిందూస్తాన్ యూనీలీవర్ అధినేత సంజీవ్ మెహ్రా అనడం గమనార్హం. అత్యధిక నిరుద్యోగం, వ్యయాలు విపరీతంగా పెరిగిపోవడం, ఆదాయాలు పడిపోవడం, వంటనూనెల నుంచి ఆటోమొబైల్స్ వరకు అన్నిటి ధరలు పెరగడం వల్ల వినియోగదారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారని, ఆచి తూచి ఖర్చు పెట్టాల్సి వస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలోకంటే ఎక్కువగా భారతీయులు ఇప్పుడు ఆహారం, వైద్యంపై ఎక్కువగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. కరోనాకు ముందున్న ప్రైవేట్ వినియోగం ఇంకా యథాస్థితికి రాలేదు. జీడీపీలో 55 శాతం వినియోగం వల్లే వస్తుందన్న విషయం చాలా మందికి తెలుసు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే దేశంలో కార్పొరేట్ కంపెనీల లాభాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 4వేల లిస్టెడ్ కంపెనీల నికర లాభాలు గతంలో ఎన్నడూ లేనంతగా 57.6 శాతం అంటే రూ. 5.31 లక్షల కోట్లకు పెరిగిపోయాయి. ప్రభుత్వం ఇచ్చే భారీ పన్ను మినహాయింపుల్ని పొందుతున్నప్పటికీ, మొత్తం ఆర్థిక వ్యవస్థ పరిస్థితికీ కార్పొరేట్ల పరిస్థితికీ ఎక్కడా పొంతన లేదు. మొత్తం జీడీపీ అభివృద్ధి రేటు పడిపోతుంటే కార్పొరేట్ అభివృద్ధి రేటు పెరుగుతోంది. మరో వైపు ఉత్పాదక, సేవారంగాల పరిస్థితీ అంత ఆశాజనకంగా లేదు. ఇలా ఎందుకు జరుగుతుందో సర్కార్ జవాబు చెప్పాల్సి ఉన్నది. భారీ లాభాలు ఆర్జించే యూనీకార్న్ స్టార్టప్‌లతో సహా దేశంలో స్టార్టప్‌లు పెరిగిపోతున్నాయని ప్రధానమంత్రి జర్మనీలో చెప్పుకున్నారు. కాని రోజురోజుకూ మూతపడే స్టార్టప్‌లు కూడా పెరిగిపోతున్నాయి. వాటి గురించి ఎవరూ మాట్లాడరు. 2025 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2019లో ప్రకటించారు. 2022 నాటికి భారత జీడీపీ 3.1 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు మాత్రమే ఉన్నది. మరో రెండేళ్లలో లక్ష్యాన్ని సాధించగలమా అన్నది చూడాల్సి ఉన్నది. 2017 నుంచి ప్రతి ఏడాదీ జీడీపీ పెరుగుదల తగ్గుతూ, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇది ఒక సవాలే. క్రూడాయిల్ ధరలు ఇలాగే పెరుగుతూ పోతే, జీడీపీ తగ్గడమే కాని పెరిగే అవకాశాలు లేవని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ప్రస్తుతానికి బ్యారెల్ క్రూడాయిల్ ధర దాదాపు 105.17 డాలర్లు కాగా, అది 2025 నాటికి మరో 66 డాలర్లు పెరుగుతుందని అంచనా. మన చమురు అవసరాలకు విదేశాలపై ఆధారపడివున్న పరిస్థితుల్లో క్రూడాయిల్ ధరలు పది శాతం పెరిగితే భారత జీడీపీ 0.2 శాతం పడిపోతుందని నిపుణులు అంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి గతంలో ఎన్నడూ లేనంతగా పడిపోయింది. ఆసియాలో అత్యంత బలహీనంగా ఉన్న కరెన్సీ మన రూపాయే అని వేరే చెప్పనక్కర్లేదు. 25 సంవత్సరాల సంగతి అటుంచి, ఈ పూట గడవడం, రానున్న ఏడాదిలో ద్రవ్యోల్బణాన్ని, నిరుద్యోగాన్ని ఎలా అరికట్టడం, ఆర్థిక మాంద్యాన్ని అరికట్టడం ఎలా సాధ్యమో మనం ఇప్పుడు ఆలోచించుకోవాలి. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలు అప్పుల విషవలయంలో ఉన్నాయి. గత 15ఏళ్లలో ఎన్నడూ లేనంతగా, రాష్ట్రాల సగటు రుణ భారం గత ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా 31.3 శాతానికి పెరిగింది. దేశంలోని 31 రాష్ట్రాల్లో 27 రాష్ట్రాల అప్పుల నిష్పత్తి విపరీతంగా పెరిగిపోయింది. భారత్ రుణభారం మార్చి 2022 నాటికి జీడీపీలో దాదాపు 59శాతం చేరుకున్నదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖే పార్లమెంట్‌లో అంగీకరించింది. ఎన్నికల్లో విజయం సాధించినంత సులభంగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించడం అంత సులువు కాదని మోదీ ప్రభుత్వానికి ఇప్పటికే తెలిసి ఉండాలి. ఒక పార్టీ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రతిపక్షాల వైఫల్యం, ప్రజల భావోద్వేగాలు మొదలైనవి కారణమవుతాయి. అమృత్ కాలం గురించి అందమైన స్వప్నాలను సృష్టించినంత మాత్రాన ప్రస్తుత తమ దుస్థితిని ప్రజలు ఏ విధంగా మరిచిపోతారు?

# మత స్వేచ్ఛ మాటున హక్కుల భక్షణ

మతస్వేచ్ఛ చట్టాలు మానవ హక్కులకు అవరోధంగా మారుతున్నాయి. ప్రాథమిక హక్కులను ప్రశ్నార్థకం చేస్తూ, వాటిని హిందువులకు మాత్రమే పరిమితం చేస్తున్నాయి. దేశ రాజకీయాల్లో మతం కీలక భూమికగా మారిన నేపథ్యంలో మతం పేరిట మనుషుల మధ్యన విభజన రేఖ గీయడం, తద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందడానికి ఇవి ఉపకరిస్తున్నాయి. మొన్న మార్చిలో హర్యానా అసెంబ్లీ చట్టవిరుద్ధ మతమార్పిడి వ్యతిరేక బిల్లును ఆమోదించింది. గత ఏడాది డిసెంబరులో కర్ణాటక అసెంబ్లీలో మత స్వేచ్ఛ హక్కుల పరిరక్షణ చట్టం ఆమోదం పొందింది. దేశంలో ఇప్పటికే 13 రాష్ట్రాల్లో ఈ చట్టాలు అమలులో ఉన్నా అనేక లోపాలతో రూపొందిన మత స్వేచ్ఛ చట్టాలు నేటికీ పార్లమెంటు ఆమోదం పొందలేకపోయాయి. 1967లో ఒరిస్సా రాష్ట్రం మత స్వేచ్ఛ పేరిట మత మార్పిడి నిరోధక చట్టం చేసింది. మత ప్రచార హక్కును ప్రాథమిక హక్కుల నుంచి తొలగించి భారతీయ శిక్షాస్మృతిలో చేర్చింది. ఈ విషయాన్ని పరిశీలించిన ఒరిస్సా ఉన్నత న్యాయస్థానం మత స్వేచ్ఛ ప్రాథమిక హక్కు అని, ప్రాథమిక హక్కులపై నిర్ణయం తీసుకునే హక్కు పార్లమెంటుకు మాత్రమే ఉందని ఆ చట్టాన్ని కొట్టివేసింది. ఒరిస్సాతో పాటు 1968లో మధ్యప్రదేశ్ రాష్ట్రం చేసిన ఈ చట్టాలు చెల్లుబాటు అవుతాయని 1977లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆర్టికల్ 25 ప్రకారం మత ప్రచారం ప్రాథమిక హక్కు గానీ, మత మార్పిడి కాదు. మత మార్పిడి ప్రాథమిక హక్కు కాకపోవచ్చుగానీ మతం మారడం ప్రాథమిక హక్కు. భారత ప్రభుత్వం 1948లో సంతకం చేసిన సార్వత్రిక మానవ హక్కుల డిక్లరేషన్ ఆర్టికల్ 18 ప్రకారం మనిషి తనకు ఇష్టమైన మతాన్ని స్వీకరించవచ్చు, మతం మారవచ్చు, సామూహికంగా కూడా మారవచ్చు. అదే విధంగా భారత రాజ్యాంగం ఆర్టికల్ 25 ప్రకారం అన్ని మతాలు సమానమే. ప్రజా భద్రత, నైతికత, ఆరోగ్యం వంటి అంశాలకు లోబడి వ్యక్తులు తమకు ఇష్టమైన మతాన్ని స్వీకరించటానికి, ఆచరించటానికి, ప్రచారం చేసుకోవటానికి హక్కు ఉంది. మతం మనిషి వ్యక్తిగతం. మారేటప్పుడు ఎవరికీ చెప్పవలసిన అవసరం లేదు. చివరకు ప్రభుత్వానికి కూడా తెలపాల్సిన పని లేదు. అయితే 1950లో రాష్ట్రపతి ఉత్తర్వు ప్రకారం హిందువుగా ఉంటేనే దళితులను షెడ్యూల్డు కులాలుగా గుర్తిస్తామని చెప్పారు. దీని వలన దళితులకు మత స్వేచ్ఛ లేకుండా పోయింది. నేటి మత స్వేచ్ఛ చట్టాలు కూడా మనుధర్మం బాటలోనే నడుస్తున్నాయనడానికి చట్టంలోని సెక్షన్ 2, 3, 5 ప్రత్యక్ష సాక్ష్యం. దళితులు, ఆదివాసీలు, మహిళలను బలవంత పెట్టి, ప్రలోభపెట్టి మతం మార్చితే 5లక్షల వరకు జరిమానా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష అని సెక్షన్ 3, 5 చెబుతాయి. సెక్షన్ 3 'మళ్లీ మార్పిడి' అంటే రీకన్వర్షన్ యథేచ్ఛగా చేసుకోవచ్చునని చెప్పింది. అలా ఆరెస్సెస్ ప్రవేశపెట్టిన ఘర్ వాప్సీకి తలుపులు బార్లా తెరిచింది. రీకన్వర్షన్‌కి ఎటువంటి షరతులు, పద్ధతులు పాటించాల్సిన అవసరం లేదని సెక్షన్ 3లో 3వ పేరా తెలిపింది. రాజ్యాంగం ప్రకారం దేశానికి ఒక మతం లేదు. అంటే, రామభక్తులకు ఎన్ని హక్కులుంటాయో, ఏసు, అల్లా భక్తులకు అవే హక్కులు ఉంటాయి. అటువంటప్పుడు ఒక వ్యక్తి హిందువుగా ఉంటే స్వీయ మతంలో ఉన్నట్టుగాను, క్రైస్తవుడిగానో ముస్లింగానో ఉంటే వారిని మతం మారిన వారిగానూ పరిగణించడం వెనుక కుట్ర కోణం కనబడుతుంది. అంటే, భారతీయులందరూ హిందువులు అనే భావనతో ఈ చట్టాలు రూపొందుతున్నాయి.

క్రైస్తవుడిగా ఉండాలంటే మతం మారుతున్నట్టు జిల్లా కలెక్టరుకి లేదా జిల్లా మెజిస్ట్రేటుకి దరఖాస్తు చేసుకోవాలి. మతం మారడానికి కష్టమైన అనేక పద్ధతులు పాటించాలి. ఈ పరీక్షలన్నీ గట్టెక్కి బయటపడ్డ తరువాత కూడా వారి రక్తసంబంధీకులు గానీ, సహచరులు గానీ ఫిర్యాదు చేస్తే వారు మారిన మతం చెల్లదు. పైగా మత మార్పిడి చట్టం కింద కేసులు కూడా పెట్టవచ్చు. అయితే, ఇదే చట్టం ప్రకారం గానీ రాజ్యాంగం ప్రకారం గానీ 18 సంవత్సరాల లోపు వారికి మతం ఉండదు. అంటే 18 సంవత్సరాల తరువాత మాత్రమే తమ స్వీయ మతం ఏమిటో వర్తిస్తుంది. అటువంటప్పుడు క్రైస్తవ మతం గానీ ఇస్లాం మతం గానీ స్వీకరిస్తే మత మార్పిడి కింద ఎలా గుర్తిస్తారు? ఈ అంశాలన్నింటిమీదా శాస్త్రీయ చర్చ జరగాలి. మతోన్మాదులకు అండగా నిలబడుతున్న సెక్షన్ 3లోని మూడవ పేరాను తొలగించాలి. ఎందుకంటే మార్పిడికి ఎటువంటి పద్ధతి ఉంటుందో తిరిగి మారడానికి కూడా అదే పద్ధతి ఉండాలి. విద్వేషంతో కూడిన మత స్వేచ్ఛ చట్టాలను ఎవరూ స్వాగతించరు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత. కులం మతం కేంద్రంగా జరుగుతున్న రాజకీయాలు కాదు, మనిషి భూమికగా రాజ్యం ఉండాలని చేసే పోరాటంలో అంతా చేయి కలపాలి.

# స్థానికులు రోడ్లపై చెత్త పడవేయకుండా చర్యలు తీసుకోవాలి



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి :నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఐ.ఏ.ఎస్, క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బుధవారం 21వ డివిజన్ పరిధిలోని కృష్ణలంక, బర్మా సీతారామయ్య స్కూల్ రోడ్, గుంటూరు వారి వీధి, మెట్ల బజార్ మరియు కృష్ణ నది పరివాహక ప్రాంతాలలో పర్యటిస్తూ, స్థానికంగా ప్రజలు ఎదుర్కొను ఇబ్బందులు మరియు పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. గుంటూరు వారి వీధిలో ఎస్.ఎస్ టవర్స్ వద్దన గల ట్రాన్స్ ఫారం దగ్గర పబ్లిక్ చెత్త వేయుట గమనించి అధికారులకు పలు సూచనలు చేస్తూ, స్థానికంగా అక్కడ చెత్త వేసే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకొనేలా చూడాలని అన్నారు. మెట్ల బజార్ నందు స్థానికులు వీధి దీపాలు సరిగా వేలుగడం లేదని తెలిపిన దానిపై తక్షణమే స్పందిస్తూ, యుద్దప్రాతిపదికన వాటికి తగిన మరమ్మత్తులు నిర్వహించాలని మరియు బర్మా సీతారామయ్య స్కూల్ రోడ్ నందలి అనధికార ఆక్రమణలను తక్షణమే తొలగించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. తదుపరి మెట్ల బజార్ చివర కృష్ణ నది పరివాహక ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంలో నది ఒడ్డున అక్కడక్కడ గల నీటి నిల్వలలో దోమల లార్వా వృద్ధికి అవాసాలుగా ఉండి దోమల సమస్య అధికంగా ఉందని స్థానిక కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా ఆయా ప్రాంతాన్ని పరిశీలించి దోమల లార్వా వృద్ధి చెందకుండా నీటి గుంటలలో యాంటి లర్వాల్ ఆపరేషన్ పనులు నిర్వహించి లార్వా దశలోనే నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టాలి. అదే విధంగా ఆయా ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ తీరు, డ్రెయిన్స్ నందు మురుగునీటి పారుదల విధానము, ప్రధాన మరియు అంతర్గత రోడ్ల మరియు ఇంటింటి చెత్త సేకరణ విధానం మొదలగు అంశాలను పరిశీలించి పరిసరాలు అన్నియు పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని, రోడ్లపై లేదా డ్రెయిన్ లలో ఎవరు చెత్త మరియు వ్యర్ధములు పారవేయకూడా చూడాలని ప్రజారోగ్య అధికారులను అదీశించారు. ఆఫీసర్ డా.జి.గీతబాయి, హెల్త్ ఆఫీసర్ డా.ఇక్బాల్ హుస్సేన్ మరియు పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి ని కలిసిన పల్నాడు జిల్లా ఇన్చార్జి మంత్రి కారుమూరి



నరసరావుపేట.మే 4 (ప్రజాపాలన ప్రతినిధి) :జిల్లా పర్యటనలో భాగంగా మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి ని నరసరావుపేటలోని వారి నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు.మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుని ఘనంగా సత్కరించిన మాజీ మంత్రి కాసు కృష్ణా రెడ్డి.

## ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుడివాడ ఉచిత మజ్జిగ పంపిణీ



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి మే 04: బుధవారం ఉదయం 11 గంటలకు నెహ్రూ చౌక్ వద్ద దాతలు వి వెంకట సుబ్బయ్య లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం ఉచిత మజ్జిగ పంపిణీ జరిగింది ఈ కార్యక్రమంలో లో పూర్వాధ్యక్షులు మల్లంపల్లి వెంకట రావు ఆధ్వర్యంలో పౌండర్ ప్రెసిడెంట్ ఈశ్వర్ రావు ఈశ్వర్ వెంకటేశ్వరరావు అధ్యక్షులు దండమూడి సీతా రామస్వామి గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర రావు బొగ్గవరపు తిరుపతయ్య లింగం చిట్టిబాబు ప్రసంగించారు కుటుంబరావు బసవేశ్వర రావు మెరుగు మాల బ్రహ్మయ్య కోలా వెంకటేశ్వరరావు , కార్యదర్శి అర్జా ప్రసాద్, కోశాధికారి చింతా దుర్గా రామకృష్ణ, వరలక్ష్మి క్లాత్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

# త్రాగునీరు, వైద్య, వ్యవసాయ రంగానికి సంబంధించి ఉన్న సమస్యల పరిష్కారానికి వినతి



పల్నాడు జిల్లా.నరసరావుపేట.మే 4 (ప్రజాపాలన ప్రతినిధి):లిపల్నాడు జిల్లా ఏర్పాటైన తర్వాత.. జిల్లా కేంద్రంలోని నరసరావుపేట కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన తొలి జిల్లా సమీక్ష సమావేశంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ లోతేటి శివశంకర్ , జలవనరుల శాఖా మాత్యులు అంబటి రాంబాబు , వైద్య-విద్యా, కుటుంబ సంక్షేమ శాఖ మాత్యులు శ్రీమతి విడదల రజిని , ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి , ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మ నాయుడు గారు, నంబూరి శంకర్ రావు గారు, కాసు మహేష్ రెడ్డి , ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్ , లక్ష్మణ రావు , జంగా కృష్ణమూర్తి ఎస్పీ రవి శంకర్ రెడ్డి, జేసి శ్యామ్ ప్రసాద్... జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎజెండాలో పేర్కొన్న అంశాల్లో భాగంగా.. వేసవిలో తాగు నీటి సరఫరాపై సుదీర్ఘ చర్చ జరిగింది. నరసరావుపేట శాసనసభ్యులు శ్రీ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. విపర్ల రెడ్డి పాలెం గ్రామంలో మంచినీటి చెరువు ఏర్పాటుకు సంబందించి గుంటూరు బ్రాంచ్ కెనాల్ నుంచి హాల్ఫ్ టెక్ కావాలని కోరారు. చెరువులో నీరు నింపేందుకు కావాల్సిన పరిపాలన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. అన్నవరం గ్రామంలో శేషమ్మ చెరువు ఏర్పాటుకు అంచనాలు తయారు చేశారని, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. సీపీడబ్ల్యూ పరంగా రిపేర్లు ఉన్నాయని వాటిని బాగు చేయాలని కోరారు. చిన్నతురకపాలెం, మునుమాక, విపర్లపల్లి గ్రామాల్లో సమగ్ర రక్షణ నీటి పథకం కింద నీరు చేరేలా చూడాలని కోరారు. గోనేపూడి గ్రామంలో రూ.80 లక్షలు నాబార్డు గ్రాంట్ కింద మంజురవ్వగా పైప్ లైన్లు కూడా వేశారని.. మోటర్ల ద్వారా నీటి తరలింపునకు సంబంధించి చేరువు వద్ద కరెంట్ సప్లై కోసం రూ.9.8 లక్షలు వెచ్చించినా ఇంకా విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదన్నారు. వీలైనంత త్వరగా విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరారు. ఇటీవలే నరసరావుపేట మున్సిపాలిటిలో మేజర్ వాటర్ పైప్ లైన్ లీకేజీతో ప్రజలు వారం రోజులు పాటు నీరు లేక ఇబ్బంది పడ్డారని... 20 ఏళ్ల క్రితం వేసిన పైపు లైన్లు పాడైపోయి ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటిలో కొత్త పైప్ లైన్ల ఏర్పాటుకు సహకారం అందించాలని విజప్తి చేశారు.నరసరావుపేట ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేయాలని కోరారు. దీంతో పాటు స్టాఫ్ అప్ గ్రేడిషన్ కూడా జరిగితే గుంటూరు జీజీహెచ్ మీద ఒత్తిడి తగ్గించడంతో పాటు పల్నాడు ప్రజలకు వైద్య సేవలను మరింత దగ్గర చేసినట్లు అవుతుందని అన్నారు.

గతేడాది మిర్చిపంటకు తామర తెగులు సోకి... రైతులు చాలా నష్టపోయారని.. బయోఫెర్టిలైజర్స్ వాడకం ద్వారా కొన్ని గ్రామాల్లో తెగులు బెడత కొంత తగ్గిందని తెలిపారు. ఈ ఏడాది పంట వెస్తే తెగులు వచ్చే అవకాశాలు ఉన్నాయా? ఉంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్య పరచాలని కోరారు.

## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పునర్నిర్మించబడిన శ్రీభద్రావతి మాత సమేత శ్రీభావనరుషిస్వామివారి దేవాలయ విగ్రహ పునఃప్రతిష్ఠ



వినుకొండ మే 04 (ప్రజాపాలన ప్రతినిధి): పట్టణం లోని దక్షిణంబజార్,గమిడి ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో వినుకొండ నియోజకవర్గ స్థాయి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పునర్నిర్మించబడిన శ్రీభద్రావతి మాత సమేత శ్రీభావనరుషిస్వామివారి దేవాలయ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు,06.05.2022 వ తేది శుక్రవారం ఉదయం నుండి 08.05.2022 వతేది ఆదివారం సాయంత్రం వరకు జరుగనున్నవి.ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను తమకు ఇందువెంట పంపుకొనుచున్నాము. కావున తమరు పై కార్యక్రమాలకుహాజరు కావాలని వినుకొండ నియోజకవర్గ స్థాయి పద్మశాలి సంఘం తరపున ఆహ్వానిస్తున్నాము .

## చిక్కవరం గ్రామం లో అగ్నిప్రమాదం.. పూరీల్లు దగ్ధం



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి మే04:గన్నవరం మండలం చిక్కవరం గ్రామంలో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది చిక్కవరం గ్రామంలోని కొణతం కనకరావు కు చెందిన ఇంట్లో గ్యాస్ బండ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఇల్లంతా అలుముకున్నాయి స్థానికులు మంటలు అర్పె ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకుండా పోయింది ఈ ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది విలువైన సామాగ్రి మరియు డాక్యుమెంట్లు తో పాటు కొంత మేరకు నగదు బట్టలు తదితర వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి అని బాధితుడు వాపోతున్నాడు సంఘటన స్థలానికి చేరుకొన్న ఫైర్ సిబ్బంది పూర్తిగా వివరాలు సేకరణ.

## రైల్వేస్టేషన్లలో మహిళల భద్రత, రక్షణపై చర్యలేంటి..?

**రైల్వే జీఎం, జీఆర్పీ ఎస్పీలకు 'మహిళా కమిషన్' లేఖలు**

**బాధ్యుల వ్యక్తిగత హాజరుతో వివరణకు ఆదేశాలు**

**గురజాల, రేపల్లె ఘటనలపై జాతీయ మహిళా కమిషన్ కు సిఫార్సు లేఖ**



అమరావతి:మే 4 (ప్రజాపాలన ప్రతినిధి): రైల్వేస్టేషన్ ల ఆవరణలు, రైళ్లల్లో ప్రయాణించే మహిళల భద్రత, రక్షణకు సంబంధించి చర్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ ఆయా శాఖలను వివరణ కోరింది. ఇటీవల గురజాల రైల్వేహాల్టు, రేపల్లె రైల్వేస్టేషన్లలో చోటుచేసుకున్న అత్యాచార ఘటనల నేపథ్యంలో బుధవారం రాష్ట్ర మహిళా కమిషన్ నుంచి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంకు, గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఎస్పీలకు లేఖలు వెళ్లాయి. స్టేషన్ల ఆవరణల్లో ఫ్లాట్ ఫామ్ లపై మహిళలు, బాలికలకు ప్రత్యేకంగా వేచి ఉండు విశ్రాంతి గదులు, లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, తాగునీరు, వాష్ రూమ్ ల వంటి ఇతర సౌకర్యాలపై రైల్వేశాఖ ఇప్పటికే ఎలాంటి చర్యలు తీసుకుందనే విషయాన్ని తెలపాలని.. భవిష్యత్తు ప్రణాళిక ఏవిధంగా ఉండబోతుందని కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ లేఖలో ప్రశ్నించారు. అదేవిధంగా రైల్వేశాఖ పోలీసు ఆధ్వర్యంలో సిబ్బంది కేటాయింపు, స్టేషను పరిధిలో గస్తీ, అనుమానితుల తనిఖీలు, ఫ్లాట్ ఫాంలపై ఫిర్యాదుల బాక్సుల ఏర్పాట్లకు సంబంధించి వివరణ కోరుతూ గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీకి లేఖను పంపారు. ఇప్పటికే రెండుచోట్ల జరిగిన అత్యాచార ఘటనలపై కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ రైల్వే ఎస్పీతో ఫోన్ లో మాట్లాడిన సంగతి తెలిసిందే.. ఆయాశాఖల నుంచి బాధ్యులను మహిళా కమిషన్ కు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా లేఖల్లో ఆదేశించారు. అదేవిధంగా గురజాల రైల్వేహాల్ట్, రేపల్లె రైల్వే స్టేషన్ లలో జరిగిన ఘటనలను జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర కమిషన్ ఒక లేఖను రాసింది. ఇలాంటి ఘటనలపై కేంద్ర రైల్వేశాఖను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ తాను రాసిన లేఖలో జాతీయ మహిళా కమిషన్ ను కోరారు.

## పెంకుటిల్లు కూలి మహిళ మృతి



వినుకొండ మే 04 (ప్రజాపాలన ప్రతినిధి ): వినుకొండ పట్టణంలోని అగాబావి బజారు 20వ వార్డులో పెంకుటిల్లు కూలి పంచుమర్తి లక్ష్మీ కుమారి అనే మహిళ( 56) మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం 4గంటలకు చోటుచేసుకుంది. ఈ ఘటనలో కుమార్తె తుమ్మ సభాపతి కి గాయాలు కావడంతో 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ రోజు ఉదయం కురిసిన వర్షానికి పురాతన కట్టుబడి కావటంతో పెంకుటిల్లు కూలిందని స్థానికులు తెలిపారు.

## పిల్లలు వేసవి అటల శిక్షణ శిబిరంలో పాల్గొని శెలవులను సద్వినియోగం చేసుకొండి: బాపులపాడు ఎంపీపీ జడ్పీటీసీ



గన్నవరం ప్రజాపాలన ప్రతినిధి వేం04:జిల్లా క్రీడల శాఖ అదేశాలు ప్రకారం బాపులపాడు మండలంలో సంబంధించి వేసవి శిక్షణ శిబిరాన్ని బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్ జడ్పీటీసీ కొమరవల్లి గంగాభవాని కలిసి ప్రారంభించారు అనంతరం ఖోఖో సాఫ్ట్ బాల్ కోర్టులు ప్రారంభించారు. జడ్పీటీసీ గంగాభవానీ పిల్లలతో కలిసి సరదగా ఖోఖో అడారు నెల రోజుల పాటు ఉదయం సాయంత్రం వేళల్లో ఖోఖో సాఫ్ట్ బాల్ పిల్లలు శిక్షణ ఇస్తారు ఉదయం 6 గంటల నుంచి 9 వరకు సాయంత్రం 3 గంటల నుంచి 6 వరకు విద్యార్థులు ప్రత్యేక శిక్షణ అందిస్తామని వీరవల్లి జడ్పీ పీడి ఆశోక్ కుమార్ తెలిపారు విద్యార్థులు వేసవి శెలవుల్లో టీవీలు సినిమాలు వీడియో గేములు అంటు సమయం వృధా చేయకుండా ప్రభుత్వం కల్పించిన వేసవి శిక్షణ శిబిరంలో అటలు నేర్చుకోవాలని ఎంపీపీ యర్రగొర్ల నగేష్ ఆన్నారు.వేసవి శిక్షణ కేంద్రాల ద్వారా నిష్ణాతులైన వ్యాయామ ఉపాధ్యాయులు ఇచ్చే అటల్లో మెళకువలు సూచనలు జాగ్రత్తగా నేర్చుకుని ఆటలో నైపుణ్యాలను పెంపొందించుకుని జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. అటల అటడం ద్వారా శారీరక ఉల్లాసం మానసిక ధృడత్వం లభిస్తుందని జడ్పీటీసీ కొమరవల్లి గంగాభవానీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్ జడ్పీటీసీ కొమరవల్లి గంగాభవానీ గ్రామ వైకాపా కన్వీనర్ గూడవల్లి రత్న సుధాకర్ కోడేబోయన బాబీ పిఏసిఎస్ ఛైర్మన్ అల్లాడి థెరిస్సా విద్యాకమీటి వైస్ ఛైర్మన్ చందు రాజా మోర్ల అంజనేయులు గండి చిన్నారావు పీడీ ఆర్ ఆశోక్ కుమార్ వీరవల్లి పీఈటి క్రాంతి వేలేరు పీడీ తాన్యగిరి రామన్నగూడెం పీఈటి భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

## చీరాల నియోజకవర్గంలో పర్యటించి,అభివృద్ధికి సహకరించండి



చీరాల, మే 4, ప్రజాపాలన : చీరాల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున కు, చీరాల నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ విజ్ఞప్తి చేశారు.సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జునను మర్యాదపూర్వకంగా, చీరాల వైసిపి నేతలతో వెళ్లి ఆమంచి కలిశారు.తొలుత మంత్రి నాగార్జునకు, శుభాకాంక్షలు చెపుతూ, పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.చీరాల నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, పలు సమస్యలు మంత్రికి, ఆమంచి వివ రించారు. చీరాల నియోజకవర్గ పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానించగా,మంత్రి నాగార్జున కూడా సానుకూలంగా స్పందించి, త్వరలో వస్తా నని హామీ ఇచ్చారు. ఆమంచి వెంట ఏఎంసి చైర్మన్ మార్పు గ్రెగొరీ, బండ్ల బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు పాపిశెట్టి సురేష్, సల్లూరి సత్యానం దం, వైసిపి యువజన నేత యాతం మేరి బాబు,ఉప్పులూరి విజయభాస్కరరెడ్డి,దార్ల శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనలో విద్యాదీవెన ఓ మైలురాయి

**సెంట్రల్ నియోజకవర్గంలో 5,719 మందికి జగనన్న విద్యాదీవెన: ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



విజయవాడ: పేదలకు చదువు భారం కాకూడదనే మహోన్నత ఆశయంతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మరీముఖ్యంగా విద్యా దీవెన పథకం ఈ ప్రభుత్వానికి ఒక మైలురాయి అని వ్యాఖ్యానించారు. ఈ పథకం ద్వారా (జనవరి-మార్చి, 2021-22 త్రైమాసికానికి) సెంట్రల్ నియోజకవర్గంలోని 5,719 మంది విద్యార్థులకు సంబంధించి 5,136 తల్లుల ఖాతాలలో రూ. 4 కోట్ల 41 లక్షల 20 వేల 986 రూపాయలను గురువారం జమ చేయనున్నట్లు ఓప్రకటనలో తెలిపారు. అలాగే అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి తొలివిడతలో 5,285 మంది విద్యార్థులకు గానూ 4,748 తల్లుల ఖాతాలలో రూ. 4 కోట్ల 11 లక్షల 94 వేల 837 రూపాయలను జమ చేసినట్లు వెల్లడించారు. పేదరికం చదువుకు అడ్డం కాకూడదని, ప్రతిఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో అమ్మ ఒడి, నాడు- నేడు, విద్యా దీవెన, వసతిదీవెన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రైమరీ స్కూల్ దశ నుంచి విదేశీ విద్య వరకు పేద విద్యార్థులకు అన్ని రకాల సహాయ సహకారాలందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ పథకాల ద్వారా విద్యారంగంలో డ్రాప్ అవుట్‌లు తగ్గాయని మల్లాది విష్ణు తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వం అరకొర ఫీజులు చెల్లించి విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని.. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యార్థుల చదువులను బాధ్యతగా తీసుకున్నారని పేర్కొన్నారు. ఏ ఏడాది ఫీజు రియింబర్స్ మెంట్‌ను అదే ఏడాదిలో చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. చంద్రబాబు ప్రభుత్వం చెల్లించని రూ. 1,778 కోట్ల బకాయిలను సైతం క్లియర్ చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్ పట్ల ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధికి ఇదొక నిదర్శనమని కొనియాడారు. భావితరాల తలరాతలు మార్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

# జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో నియోజకవర్గంలోని సమస్యల గురించి అధికారుల దృష్టికి తీసుకోని వెళ్లిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ మే 04 (ప్రజాపాలన ప్రతినిధి): నియోజకవర్గ శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు నరసరావుపేట పట్టణంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొని బొల్లాపల్లి మండల త్రాగు నీటి సమస్య గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు.వేసవి కాలం కావడంతో బొల్లాపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు త్రాగునీటి సమస్యతో అల్లాడుతున్నారని, అసలే అడవి ప్రాంతం కావడంతో ప్రజలు త్రాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 1. పమిడిపాడు, 2. రావులాపురం, 3.గుట్లవల్లి, 4.రెడ్డిపాలెం, 5.మేళ్ళవాగు, 6.గరికపాడు, 7.వెంకటరెడ్డిపురం, 8.లాలిపురం, 9.మర్రిపాలెం, 10.కనుమల చెరువు, 11.గుమ్మనంపాడు, 12.సీతారామపురం తండా, 13.దోమలగుండం, 14.బండ్ల మోటు, 15.వీరప్పకుంట తండా, 16.పాపయిపాలెం మరియు ఇతర 13 గ్రామాలలో బోర్లు వేసి మోటార్లను బిగించి ఆయా గ్రామాలలో త్రాగు నీటి సమస్యను తీర్చడానికి, దానికి సంభందించిన అంచనాలను రూపొందించి సంబంధిత అధికారులకు అందజేశారు. ఆలాగే ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు.అలాగే నియోజకవర్గంలో ఉన్న విద్యుత్తు సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు.దానికి సానుకూలంగా స్పందించిన పల్నాడు జిల్లా కలెక్టర్ గారు మరియు పల్నాడు జిల్లా ఇన్చార్జ్ మంత్రి వర్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు బొల్లాపల్లి మండలంలోని పైన తెలిపిన 29 గ్రామాలకు ఎట్టి పరిస్థితులలో రేపు మధ్యాహ్నం కల్లా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి బొల్లాపల్లి మండలంలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని మరియు బోర్ల ద్వారా కూడా త్వరలోనే శాశ్వత మంచినీటి పరిష్కారాన్ని చూడాలని సంబందిత అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. అలాగే విద్యుత్తు సమస్యలను కూడా తగిన పష్కారాన్ని చూడాలని సంబందిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా శివ శంకర్ లతోటి , పల్నాడు జిల్లా ఇన్చార్జ్ మంత్రి వర్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు , జలవనరుల శాఖ మంత్రివర్యులు అంబటి రాంబాబు , వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు విడుదల రజని , ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి , నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు , గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మరియు ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులుతో కలిసి పాల్గొన్న వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు .

# అధ్వాన్నంగా రోడ్డు



అవనిగడ్డ, ప్రజాపాలన ప్రతినిధి మే04: అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని దక్షిణ చిరువోలులంక గ్రామానికి కరకట్ట వద్ద నుండి ఉరిలోకి వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి చూస్తే కన్నీళ్లు వచ్చే దుస్థితి.ఈ రోజు ఈ పరిస్థితి కి కారణం అక్కడ ఉన్న ప్రజలా లేదా,ప్రభుత్వ అధికారులా, ప్రజా ప్రతినిధులా ఒక్కసారి ఆలోచించండి.ఇది మట్టి రోడ్డు కాదు తారు రోడ్డు.

## ఆపన్నులకు చేయూత నందిస్తున్న శిఖాకొల్లి చారిటబుల్ ట్రస్ట్



వేటపాలెం, మే 4, ప్రజాపాలన : శిఖాకొల్లి వెంకట సుబ్బారావు, లక్ష్మీకాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారు, ఆపన్నులకు అందజేస్తున్న సేవలు, సమాజ సేవకుల ప్రశంసలు సైతం పొందుతున్నాయి. ట్రస్టు తరపున తమవంతు, ఆపన్నులకు అండగా నిలబడటం, మనసుకు ఎంతో సంతృప్తినిస్తుందని, ట్రస్ట్ చైర్మన్ శిఖాకొల్లి రమేష్ బాబు స్పష్టం చేశారు.వేటపాలెం మండలంలోని పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన, శిఖాకొల్లి వెంకట సుబ్బారావు,లక్ష్మీకాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారు, దేశాయిపేట పంచాయతి లోని, పేరిశెట్ల రామనాగేశ్వరి అనే బాలింత కు, రు.21వేలు ఆర్థిక సహాయాన్ని, బుధవారం వేటపాలెం మండలం,దేశాయిపేట ఆరోగ్య ఉపకేంద్రం నందు అందజేశారు. ఈ కార్యక్రమా నికి ట్రస్ట్ చైర్మన్ శిఖాకొల్లి రమేష్ బాబు, ట్రస్ట్ సభ్యులు మీనాక్షమ్మ, అనూష, కిరణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

# నాటు, నాటు సాంగ్ కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ అందించిన స్టెప్ లతో అదరగొడుతున్న ఆటో రజిని



విజయవాడ, మే 4: ఒక కులం, ఒక మతం, ఒక ప్రాంతానికి కట్టుబడకుండా అందరికీ నచ్చేలా, అందరినీ మెప్పించేలా స్టూడెంట్ బ్యాక్ డ్రాప్ లో మరో పాన్ ఇండియా మూవీ ఆటో రజిని తెరకెక్కుతోంది. చాప కింద నీరులా ఇప్పటికే ఈ సినిమా విజయవాడ నగరంలో రెండు షెడ్యూల్స్ ను పూర్తి చేసుకుంది. ఈ నెల 15 వ తేదీ నుండి మూడవ షెడ్యూల్ కూడా ప్రారంభం కానుంది. లవ్, మాస్, ఎంటర్టైన్మెంట్ ప్రధానంగా రూపుదిద్దుకుంటున్న ఆటో రజిని సినిమా తొలి షెడ్యూల్లోనే పొలిటికల్ టచ్ ఇవ్వడం చూస్తుంటే ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలనపై కూడా ఆటో రజిని సినిమా ప్రభావం చూపుతుందని సమాచారం. ఇక ఈ సినిమా ప్రారంభోత్సవానికి సంబంధించి కృష్ణాజిల్లా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) కెమెరా స్విచ్ ఆన్ చేయగా, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ క్లాప్ కొట్టారు. కాగా ఎంపీ నందిగం సురేష్ ఈ సినిమాలో ప్రత్యేక పాత్రలో నటిస్తున్నారు. ఆటో ఓనర్ పాత్రలో నటిస్తున్న ఎంపీ నందిగం సురేష్, హీరో జొన్నలగడ్డ హరికృష్ణల మధ్య కొన్ని సన్నివేశాలను రెండవ షెడ్యూల్లో చిత్రీకరించారు. ఆటో రజిని సినిమాను ఆంధ్రప్రదేశ్లోనే ఎక్కువగా చిత్రీకరిస్తుండడంతో ఏపీ ప్రభుత్వం కూడా పూర్తిస్థాయిలో సహకరిస్తోందని సినిమా డైరెక్టర్ జొన్నలగడ్డ శ్రీనివాస్ చెబుతున్నారు. హీరో హరికృష్ణ స్వయానా, డైరెక్టర్ జొన్నలగడ్డ శ్రీనివాస్ కు కుమారుడు కావడంతో ఆటో రజిని సినిమాను ఒక రేంజ్లో నిర్మిస్తున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. పాన్ ఇండియా స్టార్ హీరోగా హరికృష్ణను తీర్చిదిద్దేందుకు డ్యాన్స్, ఫైట్స్ పై విపరీతమైన ఫోకస్ పెట్టారు. ఆర్ఆర్ఆర్ మూవీలో నాటు, నాటు సాంగ్ కు పనిచేసిన ప్రేమ్ రక్షిత్ ను ఆటో రజిని సినిమాకు కొరియోగ్రాఫర్ గా ఎంచుకున్నారు. ఆటో రజిని సినిమాలో ఇప్పటికే చిత్రీకరించిన ఒక సాంగ్ లో 100 మంది సీనియర్ డ్యాన్సర్ల, హీరో హరికృష్ణతో కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ వేయించిన స్టెప్ లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మరోవైపు హీరో హరికృష్ణ కూడా రజినీకాంత్ స్టైల్లో యాక్షన్ సీన్లను కూడా అదరగొడుతున్నాడు. ఫైట్ మాస్టర్ కణల్ కన్నన్ ఆధ్వర్యంలో ప్రకాశం బ్యారేజ్ కింద నైట్ ఎఫెక్ట్ లో తీసిన ఇంటరడక్షన్ సీన్ అద్భుతంగా వచ్చింది. మూడవ షెడ్యూల్ ను కూడా విజయవాడ, పరిసర ప్రాంతంలోనే పూర్తి చేయనున్నారు. నాల్గవ షెడ్యూల్లోని సెకండ్ ఆఫ్ ను భారీ సెట్టింగ్ లతో కృష్ణపట్నం పోర్టులో తీసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల విడుదలై విజయం సాధించిన పాన్ ఇండియా సినిమా కేజీఎఫ్ చాప్టర్ -2 సినిమాలో పనిచేసిన కొంత మంది ఆర్టిస్ట్ లతో, ఆటో రజిని సినిమా కోసం డైరెక్టర్ జొన్నలగడ్డ శ్రీనివాస్ టాక్స్ జరుపుతున్నారు. పాన్ ఇండియా మూవీ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా, శక్తివంతమైన వెంచర్ ఉన్న జొన్నలగడ్డ ప్రొడక్షన్స్ లో ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు కూడా జరుగుతున్నాయి. ముఖ్యంగా రజినీకాంత్ అభిమానిగా హీరో హరికృష్ణ నటిస్తుండడం, సినిమా టైటిల్లోనూ రజిని పేరు ఉండడంతో ఆయన అభిమానులు కూడా స్వాగతిస్తున్నారు. దీంతో తమిళ్ వెర్షన్ లోనూ ఆటో రజినికి మంచి రెస్పాన్స్ లభించనుంది. కాగా సినిమాకు కథను విక్రమ్ రాజ్ అందించారు. ఎడిటింగ్ గౌతమ్ రాజు, మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ, కెమెరామెన్ ప్రసాద్ బాబు, ఆర్ట్ డైరెక్టర్ చిన్నా తదితరులు పనిచేస్తున్నారు.

## క్రిస్టియన్ మైనారిటీ అభివృద్ధికి కృషి చేస్తా

**కమిషనర్ కే. శారదాదేవి**



పొన్నూరు మే04( ప్రజా పాలన ప్రతినిధి): రాష్ట్ర మైనారి వెల్ఫేర్ కమిషనర్ శారదాదేవిని బుధవారం క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చేబ్రోలు మనోరంజని కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. క్రిస్టియన్ మైనారిటీ అభివృద్ధిలొ భాగమైన చర్చిల నిర్మాణం తదితర సహాయ సహకారాలు అందించాలని మనోరంజని కమిషనర్ కే శారదాదేవిని కోరారు. అనంతరం కమిషనర్ శారదా దేవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాలతో పాటు క్రిస్టియన్ మైనారిటీ వర్గానికి కోట్ల రూపాయలు నిధులు ఇస్తున్నారని దీనిలో భాగంగా క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించారని ఆమె తెలిపారు. క్రిస్టియన్ మైనారిటీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి ఎలీషా ,మల్లెల రాజు పాల్గొన్నారు.

## లక్ష్మణ రేఖ దాటితే ఫైనే..



పొన్నూరు మే 04(ప్రజా పాలన ప్రతినిధి) పొన్నూరు పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగటం తో పాటు రోడ్డు ప్రక్కన నెట్టుడు బండ్ల చిరువ్యాపారులు రోడ్డు పై కి వచ్చి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పొన్నూరు అర్బన్ సీఐ శరత్ బాబు , కమిషనర్ డాక్టర్.ఎన్ రాధ సమన్వయంతో నెట్టుడు బండ్ల చిరు వ్యాపారులకు లక్ష్మణ రేఖ గీశారు. గీత దాటితే పైను తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. గీత దాటి ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే వారిని గుర్తించాలని సిబ్బందికి శరత్ బాబు ఆదేశాలు జారీ చేశారు .దీంతో ట్రాఫిక్ పోలీసులు 24 గంటలు పహారా కాస్తున్నారు. బుధవారం పొన్నూరు పట్టణం సెంటర్ ప్రధాన కూడళ్ళలో లక్ష్మణ రేఖను గీఇంచారు. ఏ ఎస్ ఐ దాసు, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.

## ఎమ్మెల్యే అండ.. ప్రభుత్వం సహకారం.. రైతులకే.. ఆర్ బి కె చైర్మన్ కావూరి రమణారెడ్డి



చీరాల, మే 4, ప్రజాపాలన : సన్న, చిన్న కారు, సాగు,కౌలు రైతులందరికీ,ఎమ్మెల్యే కరణం బలరాం అండగా ఉండి, ప్రభుత్వ సహకారం అందించేందుకు, కృషి చేస్తున్నారని,ఆర్ బి కె చైర్మన్ కావూరి రమణారెడ్డి స్పష్టం చేశారు. చీరాల మండలం,కావూరి వారి పాలెం పంచాయితీ పరిధిలో, ఉద్యానవన శాఖ ప్రోత్సాహంతో, సాగుచేస్తున్న పూల తోటలను, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారిణి ఎమేనియాతో కలిసి చైర్మన్ పరిశీలించారు.పూల సాగు వలన, సన్న,చిన్నకారు రైతులకు, మంచి లాభాలు వస్తున్నాయని, ఉద్యానవన శాఖ వారు ఆర్థిక సహాయం అందజేస్తున్నారని, ప్రభుత్వం సైతం రుణ సౌకర్యం కూడా కల్పిస్తోందని, చైర్మన్ రమణారెడ్డి తెలియ జేశారు.చీరాలలో సన్న, చిన్నకారు, సాగు, కౌలు రైతులందరికీ, ఎటువంటి సమస్య వచ్చినా, ప్రభుత్వం వైపు నుంచి అందే, ఏ సంక్షేమ పథ కమైనా, రాయితీ లైనా, రైతులకు ఇప్పించేందుకు, ఎమ్మెల్యే కరణం బలరామ్, ఆయన తనయుడు కరణం వెంకటేష్ లు, ఎల్లవేళలా సిద్ధమని గర్వంగా చెప్పగలుగుతున్నానని, చైర్మన్ అన్నారు. రైతులందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్బీకె చైర్మన్ రమణారెడ్డి వెంట సచివాలయ,వ్యవసాయ శాఖ, ఉ ద్యానవన శాఖ, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

## విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్డీ



పొన్నూరు మే04( ప్రజా పాలన ప్రతినిధి) :చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంవీ రాజు అనే అధ్యాపకుడికి విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ పీహెచ్డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ " ఏ స్టడీ ఆన్ ద క్యారక్టెరిస్టిక్స్ ఆఫ్ అగ్రికల్చర్ సాయిల్స్ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్, ఇండియా విత్ స్పెషల్ రెఫరెన్స్ టు రైస్, కాటన్ అండ్ టొబాకో క్రాప్స్" అనే అంశంపై పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు ఆంధ్ర యూనివర్సిటీలోని ఎన్విరాన్మెంట్ హానరరీ ప్రొఫెసర్ పెద్దినేని ప్రసాద్రావు గైడ్గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈయన పరిశోధనలో భాగంగా మొత్తం ఎస్సీఐ 2, స్కూపస్ జర్నల్ పబ్లికేషన్ 2, 4 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని తెలియజేసారు. డాక్టరేట్ పొందిన ఎంవీ రాజును విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## వస్త్ర బహుకరణ వేడుకల్లో ఎమ్మెల్యే కిలారి



పొన్నూరు మే04( ప్రజా పాలన ప్రతినిధి) :పెదకాకాని గ్రామంలో వైసీపీ కార్యకర్త రావినూతల రోశయ్య కుమార్తె, కుమారుడు మేఘన, చెర్రీ ల నూతన వస్త్ర బహుకరణ వేడుక బుధవారం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి పాల్గొన్నారు. చిన్నారులను దీవించి ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో గ్రామ వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చీరాల రూరల్ పోలీస్ అంతర్జాతీయ పోటీలకు ఎంపిక - ప్రత్యేకంగా అభినందించిన బాపట్ల జిల్లా ఎస్పీ




చీరాల, మే 4, ప్రజాపాలన : జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోల్ వాల్ట్ విభాగంలో, కాంస్య పతకం సాధించి, ఫిన్లాండ్లో జరగబోయే అంత ర్జాతీయ పోటీలకు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీస్ డిపార్ట్మెంట్ నుండి ఎంపికైన, ఏకైక స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సిహెచ్.నాగరాజుని, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన, 42 వ జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ మీట్ లో, బారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుండి సుమారు నాలుగు వేల మంది క్రీడాకారులు పాల్గొనగా, ఆంధ్ర ప్రదేశ్ నుండి దాదాపుగా 150 మంది క్రీడాకారులు పాల్గొనగా,పోల్ వాల్ట్ విభాగంలో జరిగిన ఓపెన్ కాంపిటేషన్ లో,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాపట్ల జిల్లా, చీరాల రూరల్ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సిహెచ్.నాగరాజు, కాంస్య పథకం కైవసం చేసుకొ న్నారు.భారతదేశం తరుపున ఫిన్లాండ్ దేశంలో, జరుగు అంతర్జాతీయ పోటీలకు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీస్ డిపార్ట్మెంట్ నుండి, పోల్ వాల్ట్ విభాగంలో ఎంపికైన, ఏకైక స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సిహెచ్. నాగరాజు ని, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది క్రీడలలో కూడా పాల్గొనాలని, క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి, ఎల్లవేళలా తమ ప్రోత్సాహం ఉంటుందని స్పష్టం చేశారు.

## వడ్రాణం నాగేశ్వరరావు కు నివాళులర్పించిన ఎమ్మెల్యే కిలారి



పొన్నూరు మే04( ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు మండలం పచ్చల తాడిపర్రు గ్రామంలో జనసేన పార్టీ నాయకుడు వడ్రాణం మార్కండేయ బాబు తండ్రి వడ్రాణం నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. బుధవారం ఆయన సంస్మరణ సభ పచ్చలతాడిపర్రు గ్రామంలో జరిగింది. ఈ సంస్మరణ సభలో ఎమ్మెల్యే కిలారి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాగేశ్వరరావు లాంటి మంచి వ్యక్తిని కోల్పోవటం దురదృష్టకరమని ఆయన ఆత్మ శాంతి కలగాలని కోరారు. ఈ సభలో పలువురు జనసేన, వైసిపి నాయకులు పాల్గొని నాగేశ్వరరావు కు ఘన నివాళులు అర్పించారు.

## జగనన్న కాలనీ ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



పొన్నూరు మే 04(ప్రజా పాలన ప్రతినిధి) : పొన్నూరు పట్టణం లోని జగనన్న కాలనీ ఇళ్ల ను బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. కాలనీలోని లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల మాటలకు స్పందించిన కలెక్టర్ నాలుగు వారాల్లో అన్ని వసతులు కాలనీలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు . అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 65 వేల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని పొన్నూరు పట్టణంలో 3920 గృహ నిర్మాణానికి స్థలం మంజూరు చేయడం జరిగిందని ఈ కాలనీ లో గృహ నిర్మాణం కోసం మౌలిక వసతుల కల్పనకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రోడ్లు ,నీటి, విద్యుత్ సౌకర్యాన్ని రానున్న రోజుల్లో పూర్తిగా కల్పించి గృహ నిర్మాణం వేగవంతం చేసే విధంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎన్. రాధ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు నేటి యువత మీదే ఆధారపడి ఉంది: మంత్రి ఆర్. కె. రోజా

విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి : సమాజానికి సేవ చేయాలనే ఆలోచన నేటి యువతలో ఉందని దేశ భవిష్యత్తు నేటి యువత మీదే ఆధారపడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు యువజనాభివృద్ధి శాఖా మంత్రి శ్రీమతి ఆర్.కే. రోజా అన్నారు. విజయవాడలోని కే.బి.ఎన్ కళాశాలలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ మరియు కే.బి.ఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం మంత్రి ఆర్.కే. రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ మనిషి ప్రాణాలను కాపాడే రక్తాన్ని దానం చేస్తున్న నేటి విద్యార్థులు మానవతా వాదులని మంత్రి అన్నారు. ఒకరు ఇచ్చే రక్తం మరొకరికి ప్రాణాన్ని నిలుపుతుందని రక్తదానంతో పాటు నేత్ర, అవయువదానం పై కూడా అవగాహనా కలిగి ఉండాలని మంత్రి అన్నారు. కోవిడ్ సమయంలో రక్తదాన శిబిరాలు నిర్వహించలేకపోయామని అందువల్లనే రక్త నిల్వలు తగ్గిపోయాయని ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతీ ఒక్కరూ రక్తాన్ని దానం చేయడానికి ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. విద్యార్థి దశనుండే సేవాభావంతో పనిచేస్తున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, సమాజంలో అన్ని దానాలకంటే రక్త దానం గొప్పదని ఈరోజు రక్తదాన శిబిరంలో 500 మంది విద్యార్థులు రక్తాన్ని దానం చేసారని మంత్రి అన్నారు. సమాజం పట్ల శ్రద్ధ బాధ్యతతో ప్రతి విద్యార్థి మెలగాలని చదువుతో పాటు సమాజ సేవలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని మంత్రి అన్నారు. రాష్ట్రంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది 48 రక్త దాన శిబిరాలను నిర్వహించి 2 వేల 395 యూనిట్ల రక్తాన్ని దాతల నుండి సేకరించామన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు నడిపేది యువతే అని నమ్మిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి అని నేటి యువతకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి యూత్ ఐకాన్ అని మంత్రి అన్నారు. ప్రతీ ఏటా రాష్ట్ర జిల్లా స్థాయిలో యువజనోత్సవాలు నిర్వహించడం ద్వారా యువతలోని ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదికను అందించి విజేతలైన వారికి



జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా బహుమతులు అందిస్తున్నామన్నారు. వ్యక్తిత్వ వికాసం మరియు భావ వ్యక్తీకరణ వృత్తి నైపుణ్యం పై శిక్షణ అందించి వారికి ఉపాధి అవకాశాలను ఉద్యోగ అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి రోజా అన్నారు.రాష్ట్రంలోని క్రీడా మరియు సాంస్కృతిక శాఖల సమన్వయంతో యువతకు క్రీడల్లోనూ సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పోటీలను నిర్వహించి వారిని ప్రోత్సహిస్తున్నామని మంత్రి ఆర్. కె. రోజా అన్నారు.

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ కే.బి.ఎన్ కాలేజీ విద్యార్థులు సేవ కార్యక్రమాలలో ముందంజలో ఉంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ జి. వాణి మోహన్ మాట్లాడుతూ యువతను చైతన్య పరుచుట ద్వారా సమాజ సేవలో వారిని భాగస్వాములను చేస్తున్నామని ఈ దిశగా రాష్ట్రంలోని యువత అనేక అభివృద్ధి సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారని అన్నారు. యువత శక్తి సామర్థ్యాలను దేశ, రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడేలా నేటి యువతకు యువజన సర్వీసుల శాఖ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని వాణి మోహన్ అన్నారు. యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ శ్రీమతి నాగరాణి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే నేటి విద్యార్థులు సేవా కార్యక్రమాలలో పాల్గొనేలా అవసరమైన తోడ్పాటును యువజన సర్వీసుల శాఖ అందిస్తున్నదన్నారు. కె.బి.ఎన్ కాలేజ్ లో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో గుంటూరు జె కె సి కాలేజ్, హిందూ ఫార్మసీ కాలేజ్, పాలిటెక్నిక్ కళాశాల, ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ, విజయవాడ ధనికుల ఇంజినీరింగ్ కాలేజ్, యూ ఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజ్, ఎస్. ఆర్. కె. ఇంజినీరింగ్ కాలేజ్, ఈ ఎస్ ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ లకు చెందిన 500 మంది విద్యార్థులు ఈ మెగా రక్తదాన శిబిరంలో రక్తాన్ని దానం చేసారని శ్రీమతి నాగరాణి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, రాష్ట్ర సాంస్కృతిక అకాడమీ చైర్ పర్సన్ శ్రీమతి పి. శ్రీ లక్ష్మి, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్ పర్సన్ కుడిపూడి సత్య శైలజ, నగరం లోని కార్పొరేటర్ లు, సాంస్కృతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ కృష్ణ, కే.బి.ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, కరస్పాండెంట్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన మహిళ వాలంటీర్



పామర్రు,ప్రజాపాలన ప్రతినిధి మే4: పామర్రు గ్రామ పంచాయతీ పరిధిలో మూడో వార్డు లోని చాట్లవానిపురం నివాసం ఉంటున్న చాట్ల నాగేశ్వరావు గత ఐదు రోజుల నుండి పక్షవాతం వ్యాధితో విజయవాడ ఆస్పటల్ లో చికిత్స పొందుతున్నారు, పెన్షన్ గడువు రేపటితో ముగియాతూడటంతో మూడవ సచివాలయం వాలంటీర్ తోడేటి అన్నపూర్ణ విజయవాడ ఆస్పటల్ వెళ్లి పెన్షను నాగేశ్వరరావు అనే వ్యక్తికి అందజేయడం జరిగింది అన్నపూర్ణను పలువురు నాయకులు అభినందించడం జరిగింది.

## ప్రజల సమస్యల పై పోరాడతాం: పొబ్బా సాయి




కావలి మే 4ప్రజాపాలన ప్రతినిధి: నియోజకవర్గ ప్రజా సమస్యలపై పోరాడుతాం అని జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయి విఠల్ తెలిపారు.బుధవారం జర్నలిస్ట్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ జనసేన రాష్ట్ర ఆదేశాల మేరకు ,జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి ,మీడియా కో ఆర్డినేటర్ మన్నెపల్లి రిషికేష్ ,నియోజకవర్గ సమన్వయ కర్త తిరుమల శెట్టి సుధీర్ ,కావలి రూరల్ మండల అధ్యక్షుడు గడిపల్లి వెంకయ్య,బోగోలు మండల అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ ,అల్లూరు మండల అధ్యక్షుడు కార్తీశర్మ ,దగదర్తి మండల అధ్యక్షుడు చొప్పర శివకృష్ణ ,నియోజకవర్గ సలహాదారుడు బెల్లంకొండ శ్రీనివాసులు ,రాష్ట్ర కార్యదర్శి ,మత్స్యకార వికాస్ విభాగం అధ్యక్షుడుగా కొండ్రంగి శ్రీనివాసులను నియమించినట్లు తెలిపారు.రిషికేష్ ,తిరుమల శెట్టి సుధీర్ లు మాట్లాడుతూజనసేన పార్టీలో పదవులు లేకపోయిన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డామని,పార్టీ మమ్మల్ని గుర్తించి పదవులు కేటాయించి నందుకు కావలి నియోజకవర్గ ఇంచార్జ్ అలహరి సుధాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీకి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.వారి వెంట అలా శ్రీనాద్ ,నాగార్జున ,లాయర్ సిద్దు ,బెల్లంకొండ మస్తాన్ ఉన్నారు.

## వెల్లలూరు లో రైతులకు అవగాహన కార్యక్రమం



పొన్నూరు మే04( ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు మండల పరిధి వెల్లలూరు గ్రామం రైతు భరోసా కేంద్రం లో గ్రామ రైతులకు పొన్నూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. పొన్నూరు ఏ డి ఎ హెచ్ తిరుమలాదేవి పాల్గొని మాట్లాడుతూ 2022 – 23 సంవత్సర ఖరీఫ్ సీజన్ కు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జనుము పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై ఇస్తామని తెలిపారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని ఆమె తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న పట్టాదారు పాసుపుస్తకం ఫోన్ నెంబరు తీసుకు రావాలని కోరారు. కౌలుదార్లు తమ కార్డులను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు రైతు భరోసా కేంద్రాన్ని కానీ స్థానిక వ్యవసాయ కార్యాలయం నందు సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సత్యానందం, వి ఏ ఏ సవిత రైతులు పాల్గొన్నారు.

## వడ్డి ముక్కల గ్రామం లో గ్రామసభ



పొన్నూరు మే04( ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు మండల పరిధిలోని ముక్క గ్రామంలో బుధవారం గ్రామ సభ జరిగింది. ఈ గ్రామ సభలో పొన్నూరు మండలం ఎంపీడీవో అత్తోట దీప్తి పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో జగనన్న ఇళ్ల నిర్మాణం వివరాలను గ్రామ సచివాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నూతన పెన్షన్ లు వైట్ రేషన్ కార్డులు తదితర ప్రభుత్వ పథకాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రధానంగా గ్రామంలో పారిశుధ్యం నూరు శాతం అమలు జరగాలని ఆమె సూచించారు .వివిధ పథకాలపై ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ ఉద్దేశం నూరు శాతం అమలయ్యేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ పి ఆర్ డి నాగనంత్, గ్రామ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భవిష్యత్ కార్యాచర ణతో పోరాటాలకు సిద్ధం కావాలి:సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ



చిలకలూరిపేట: కార్మిక హక్కుల సాధనకు మేడే స్పూర్తితో కార్మికులు సంఘటితమై పోరాటాలు చేయాలని చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ తెలిపారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మేడే ఉత్సవాలల్లో భాగంగా ఏఐటీయూసీ అనుబంధ విఘ్నేశ్వర లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం యడ్లపాడు మండల కేంద్రం తహశీల్దార్ కార్యాలయం సమీపంలో అరుణ పతకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బాయమ్మ మాట్లాడుతూ యావత్ ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల సాధనకు బాటలు వేసిన చారిత్రాత్మక రోజే ఈ “మేడే” అని , మేడే స్ఫూర్తితో హక్కులను సాధించుకుందామని పిలుపు నిచ్చారు. పెరిగిన పెట్రో ధరల ప్రభావం సరకు రవాణా రంగం లారీలపై పడుతుందని, విడి భాగాలు, ఫైనాన్సులు అధికమై సరకు రవాణా రంగం స్థంబించి పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ధరల నియంత్రణ, కనీస వేతనాల కోసం కా ర్మికులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ కా ర్మిక దినోత్సవాన్ని ఉత్స వంగా కాకుండా గతాన్ని స మీక్షించుకుని భవిష్యత్ కార్యాచర ణతో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరివరహాలు, నాయకులు సీఆర్ సృజన్, నరసింహభారతి, విఘ్నేశ్వర లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సోమరాజు రామాంజనేయులు, సోమరాజు వెంకటేశ్వర్లు, ఉప్పిరెట్ల కాలేష, సాయి శ్రీను , తుమ్మిశెట్టి అర్జన ఒంటిపులి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మల్ల దొడ్డి లో ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ మాధవీలత




గోకవరం ప్రజా పాలన విలేఖరి మే 4 :పేదలకు ఎంతో మేలు చెయ్యాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె మాధవిలత అన్నారు. ది పీఎంపీ అసోసియేషన్ గోకవరం, ఏజన్సి మండలాలు మరియు లలిత మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు పీ చిన్ని పుట్టినరోజు సందర్భంగా బుధవారం మండలం లోని గుమ్మళ్ళదొడ్డి గ్రామం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కలెక్టర్ మాధవిలత ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, పీఎంపీ అసోసియేషన్ సేవలు అభినందనీయమని అన్నారు. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ పల్లెసీమల్లో పీఎంపీ లు చక్కటి సేవలందిస్తున్నారని,ఈ సందర్భంగా పుట్టినరోజు నాడు ఇలా సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసిన పీ చిన్నీని అభినందించారు.ఈ వైద్య శిబిరం లో రాజమండ్రి కి చెందిన స్మార్ట్ ఎమర్జన్సీ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ గౌతమ్,డాక్టర్ విజయవర్ధిని,డాక్టర్ మౌనిక,విజయభారతీ చెస్ట్ ఇన్స్టిట్యూట్ వైద్యనిపుణులు డాక్టర్ గూడూరి మంగాదేవి,బుద్దుడు హాస్పిటల్ కంటి వైద్యులు డాక్టర్ సజ్జా స్వేత లు వైద్య సేవలందించారు.ఉచితంగా రక్తపరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు.ఇరవై మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఆసుపత్రికి తీసుకుని వెళ్ళారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ జిల్లా కార్యదర్శి బళ్ళా శ్రీనివాసరావు,మార్కెట్ యార్డు చైర్మన్ జనపరెడ్డి హిమశైలుబాబు,జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ రమేష్, ఎమ్పీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, వరసాల కుమారి ప్రసాద్, కర్రి సూరారెడ్డి, పాటి రాంబాబు,గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు ఎస్ నానీ,అబ్బిరెడ్డి చిన్ని,అబ్బిరెడ్డి రామభద్రం, కె శివాజీ, ఎస్ మురళీ ల చేతుల మీదుగా సిమ్మెంట్ బెంచీలు ప్రారంభించారు. పీఎంపీ మండల కార్యదర్శి ఎమ్ నాగేశ్వరరావు, కోశాధికారి జి లాజర్,వై పవన్,కె వెంకటేశ్వరరావు, ఎస్ నాగేశ్వరరావు, జి నానీ,ఎమ్ మల్లేష్,దుర్గాప్రసాద్, ఎస్ వెంకటేష్, ఎస్ అర్జునరావు, వలి,రాజేష్ ఫౌండేషన్ కార్యదర్శి జి వెంకటేష్, కోశాధికారి జాజుల శివాజీ, డి స్వామి, ఎమ్ బాపిరాజు, సబ్బారావు,స్మార్ట్ హాస్పిటల్ మేనేజర్ రాధాకృష్ణ సిబ్బంది,జెడ్పీ హై స్కూల్ ఉపాధ్యాయులు హాజరయ్యారు,పాఠశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే చంటిబాబు ను సభ్యులు ఘనంగా సత్కరించారు.

## మాజీమంత్రివర్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి కృతజ్ఞతలు తెలియజేసిన: తుపాకుల అప్పారావు



తెలుగుదేశం పార్టీ బీసీ(దాసరి) సాధికార సమితి కన్వీనర్ గా నియమితులైన తుపాకుల అప్పారావు నియామకం పట్ల చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అప్పారావుని, మాజీ మంత్రివర్యులు ప్రత్తిపాటి పుల్లారావు శాలవాతో సత్కరి0చడం జరిగింది. ఈ సందర్భంగా తుపాకుల అప్పారావు మాట్లాడుతూ, బీసీ(దాసరి) సాధికార సమితి కన్వీనర్ గా తన ఎంపికకు సహకరించిన మాజీ మంత్రివర్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ(దాసరి) సాధికార సమితి కన్వీనర్ గా తనపై నమ్మకం ఉంచి, ఇచ్చిన బాధ్యతను అంకితభావంతో నిర్వహించి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. పేదల అభ్యున్నతికి టిడిపి ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై కూడా నిరంతరం పోరాటం చేస్తూ, టిడిపి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కి, రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు కి, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి, ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా, రాష్ట్ర నాయకులు, పార్టీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, తుపాకుల అప్పారావు కి శుభాకంక్షాలు తెలియజేయడం జరిగింది.

## గోకవరం మండలం లో జిల్లా కలెక్టర్ మాధవిలత పర్యటన



గోకవరం ప్రజాపాలన విలేఖరి మే 4 :గోకవరం మండలంలో పర్యటించిన శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు గారు మరియు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవి లత ఈ పర్యటనలో భాగంగా అచ్చుతాపురం గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ మాధవీలత. శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఉన్న విద్యుత్ లైన్ సమస్య గురించి విద్యుత్ అధికారులు మరియు గోకవరం ఎమ్మార్వో అక్కడ ఉన్న సమస్యను స్కెచ్లు రూపంలో చూపించి కలెక్టర్ మరియు శాసన సభ్యులు వారికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవి లత మాట్లాడుతూ గ్రామంలో ఉన్న విద్యుత్ లైన్ సమస్యను పలుమార్లు శాసనసభ్యులు మా దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. మీ గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ లైన్ కు చర్యలు చేపడతామని , దానికోసం రైతులను ఒప్పించి పొలాల మీదగా విద్యుత్ లైన్ వెళ్ళేలా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా మీ గ్రామంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ అడగగా గ్రామంలో ఉన్న త్రాగునీటి సమస్య గురించి మరియు డ్రైన్లు మరియు సి.సి రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు కలెక్టర్ గారి దృష్టికి తీసుకు వచ్చినారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని కలెక్టర్ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండల ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు మరియు మండల అధికారులు పాల్గొన్నారు.

## వడ్లమూడి వైసిపి సీనియర్ నాయకులు తాడేపల్లి మృతి



పొన్నూరు మే04( ప్రజా పాలన ప్రతినిధి) : చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ వైసీపీ సీనియర్ నాయకులు తాడేపల్లి సాంబశివరావు ( స్వామి ) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్నా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య తాడేపల్లి సాంభశివరావు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించి కుటుంబ సభ్యులకి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తాడేపల్లి సాంబశివరావుకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

## బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా అద్దేపల్లి శివసుందరరాజు



విజయవాడ,ప్రజాపాలన :పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్(నాని) సిఫార్సు మేరకు విజయవాడ సర్కిల్ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్( బిఎస్ఎన్ఎల్) టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా అద్దేపల్లి శివసుందరరాజు నియమితులైయ్యారు.ఈ మేరకు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి నియమితులైనట్లు లేఖ ద్వారా బిఎస్ఎన్ఎల్ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని అద్దేపల్లి శివసుందరరాజు కు బుధవారం విజయవాడ పార్లమెంట్ సభ్యుని కార్యాలయంలో నియమక పత్రం అందజేశారు.బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా తనను ఎంపిక చేసినందుకు ఎంపి కేశినేని నాని కి అద్దేపల్లి శివసుందరరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు లింగమనేని శివరాం ప్రసాద్, సారేపల్లి రాధాకృష్ణ, మరుపిళ్ళ తిరుమలేష్, మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున్, సినీయర్ నాయకులు పరిశపోగు రాజేష్, కోగంటి రామారావు తదితరులు పాల్గొన్నారు

## రిజిస్ట్రేషన్ అనుమతి లభించిన మన పొన్నూరు బ్లడ్




పొన్నూరు మే 04(ప్రజా పాలన ప్రతినిధి) :మన పొన్నూరు బ్లడ్ డోనర్స్ ని మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ గా రిజిస్ట్రేషన్ జరిగింది. 2017 నుంచి నిర్విరామంగా ఇప్పటివరకు సహకరించిన దాతలు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు మన పొన్నూరు బ్లడ్ డోనర్స్ తెలియజేశారు. అలానే స్వచ్ఛంద కార్యక్రమాలకి సోషల్ యాక్టివేట్ కార్యక్రమానికి సహకరించిన వారందరికీ పేరుపేరునా బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్ తిరుమల శెట్టి ఉమాశంకర్ తిరుమల శెట్టి సీతారామయ్య గుడివాడ రాజనాల యశ్వంత్ తేజ నరేంద్ర గుంటూరు శ్రీనివాస గుప్తా హరీష్ తదితరులు పత్రికా ముఖంగా తెలిపారు.

## తారక్ పై డ్యాన్స్ మాస్టర్ సంచలన కామెంట్స్



టాలీవుడ్ స్టార్ హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్ పై క్రేజీ డ్యాన్స్ డైరెక్టర్ శేఖర్ మాస్టర్ తాజాగా సంచలన కామెంట్ చేశారు. ఎన్టీఆర్ కు ఇండస్ట్రీలో సింగిల్ టేక్ ఆర్టిస్ట్ అనే పేరుంది. అయితే ఆయనకు మరో పేరు కూడా వుందని ఈ సందర్భంగా వెల్లడించి షాకిచ్చారు వీజే శేఖర్ మాస్టర్. వివరాల్లోకి వెళితే.. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన యాక్షన్ ఎంటర్ టైనర్ సర్కారు వారి పాట. కీర్తి సురేష్ హీరోగా పరశురామ్ తెరకెక్కించిన ఈ చిత్రం మే 12న భారీ స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది.ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచడంతో సినిమాపై ఎక్స్ పెక్టేషన్స్ పెరిగిపోయాయి. పోకిరి గుర్తు చేస్తోందంటూ ఫ్యాన్స్ నెట్టింట వైరల్ గా ప్రచారం చేయడం మొదలు పెట్టారు. తాజాగా ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా డ్యాన్స్ డైరెక్టర్ శేఖర్ మాస్టర్ మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఈ సినిమాలో మొత్తం మూడు పాటలకు డ్యాన్స్ కంపోజ్ చేశానని చెప్పారు. కళావతి పెన్నీ పాటలతో పాటు మరో మాస్ సాంగ్ కు డ్యాన్స్ కంపోజ్ చేశానని తెలిపారు.ఈ సందర్భంగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. టాలీవుడ్ లోవున్న సింగిల్ టేక్ ఆర్టిస్ట్ ఎన్టీఆర్ అని అలాగే ఆయన సింగిల్ టేక్ డ్యాన్సర్ కూడా అని చెప్పి షాకిచ్చారు. ఎన్టీఆర్ డ్యాన్సులకు చాలా ప్రత్యేకత వున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్నే వెల్లడిస్తూ ఎన్టీఆర్ సెట్ లో డ్యాన్స్ అసలు ప్రాక్టీస్ చేయరని రిహార్సల్స్ అవసరం లేని హీరో ఆయనే అని ప్రశంసల వర్షం కురిపించారు. డ్యాన్స్ మాస్టర్ మూవ్ మెంట్ చెప్పిన వెంటనే రిహార్సల్స్ కూడా అవసరం లేదని డైరెక్ట్ గా ఫ్లోర్ ఎక్కేస్తారు అని చెప్పుకొచ్చారు. ఇటీవల ట్రిపుల్ ఆర్ లో చరణ్ తో కలిసి ఎన్టీఆర్ నాటు నాటు సాంగ్ ని వీరి లెవెల్లో ఇరగదీసిన విషయం తెలిసిందే. అయితే సూర్తి స్థాయిలో సోలో గా నటించిన చిత్రాలలో మాత్రం ఎన్టీఆర్ ఈ మధ్య కాలంలో అభిమానులు ఆశించిన స్థాయిలో డ్యాన్స్ చేయలేదు. దీంతో ఫ్యాన్స్ అంతా ఎన్టీఆర్ 30 వ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొరటాల శివ డైరెక్ట్ చేయబోతున్న ఈ మూవీలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఊహించినట్టే డ్యాన్సులతో అదరగొడతాడో వేచి చూడాల్సిందే.

## ఎఫ్3 బ్యూటీ మైండ్ బ్లాంక్ చేసే అందం



నాని హీరోగా నటించిన కృష్ణగాడి వీర ప్రేమగాథ సినిమా తో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మెహ్రీన్ ఆ తర్వాత ఎన్నో సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింతగా చేరువ అయ్యింది. ఆమద్య పెళ్లి చేసుకోబోతున్నట్లుగా ప్రకటించి అభిమానులకు షాక్ ఇచ్చిన మెహ్రీన్ కొన్ని కారణాల వల్ల పెళ్లి క్యాన్సిల్ చేసుకుంది. హీరోయిన్ గా ప్రస్తుతం వరుసగా సినిమాల్లో నటించేందుకు సిద్దం అవుతుంది.త్వరలో ఎఫ్ 3 సినిమా తో వరుణ్ తేజ్ తో కలిసి ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఒక కన్నడ సినిమా లో కూడా ఈమె నటించింది. ఆ సినిమా త్వరలోనే విడుదల కాబోతుందట. తెలుగు లో రెండు మూడు సినిమాల చర్చల దశలో ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. త్వరలోనే ఒక యంగ్ స్టార్ హీరోకు జోడీగా ఈ అమ్మడు నటించేందుకు రెడీ అవుతుంది. ఆ విషయమై త్వరలో అధికారిక ప్రకటన రాబోతుందట.హీరోయిన్ గా సినిమాలు ఎక్కువగా చేయకున్నా కూడా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేయడం వల్ల వైరల్ అవుతూనే ఉంటుంది.తాజాగా మరోసారి ఆమె తన అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇలా పొట్టి స్కర్ట్ ను వేసుకుని థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. పొడుగు కాళ్ల ఈ సుందరి అందం విషయంలో స్టార్ హీరోయిన్స్ కు ఏమాత్రం తగ్గేది లేదు అన్నట్లుగా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి.మెహ్రీన్ తెలుగు లో మహానుభావుడు.. రాజా ది గ్రేట్.. జవాన్.. పంథం.. నోటా.. కవచం... ఎఫ్ 2.. ఛాణక్య... ఎంత మంచివాడవురా.. అశ్వథామ తో పాటు ఇంకా పలు సినిమాల్లో నటించింది.

## మహేష్ అసంతృప్తిగా వున్నారా? ఎందుకు?



సూపర్ స్టార్ మహేష్ బాబు మొత్తానికి సర్కారు వారి పాట పూర్తి చేశారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఎట్టకేలకు మే 12న మరో 9 రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఇప్పటికే ఈ మూవీ ప్రచార కార్యక్రమాల్ని ప్రారంభించేశారు. సోమవారం విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. పోకిరి టైమ్ మహేష్ ని చూసిన ఫీలింగ్ ని కలిగించింది. మొదటి నుంచి మహేష్ చెబుతున్న పోకిరి వైబ్స్ ట్రైలర్ లో కనిపించడం తో ఫ్యాన్స్ ప్రస్తుతం పండగ చేసుకుంటున్నారు. దాదాపు రెండేళ్ల విరామం తరువాత మహేష్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ మూవీ కోసం మహేష్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ తరువాత మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ డైరెక్షన్ లో మహేష్ నటించనున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ మూవీని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై ఎస్. రాధాకృష్ణ నిర్మించనున్నారు. ఈ భారీ చిత్రాన్ని జూన్ నుంచి సెట్స్ పైకి తీసుకెళ్లాలని ప్లాన్ చేశారట.అయితే త్రివిక్రమ్ బ్యాక్ టు బ్యాక్ మూడు రీమేక్ సినిమాలతో బిజీగా వుండటం తన సినిమాని పక్కన పెట్టడం మహేష్ ని అసహనానికి గురిచేస్తోందని చెబుతున్నారు. భీమ్లానాయక్ నుంచి త్రివిక్రమ్ వరుస ప్రాజెక్ట్ లని పవన్ కు సెట్ చేస్తూ వాటికి సంబంధించిన బ్యాకెండ్ వర్క్ ని అంతా ఆయనే చూసుకుంటున్నారు. ప్రస్తుతం మూడు సినిమాలకు సంబంధించిన వర్క్ ని ఆయనే పర్యవేక్షిస్తున్నారట. దీని కారణంగా మహేష్ కు ఇంత వరకు త్రివిక్రమ్ పూర్తి స్క్రిప్ట్ ని వినిపించ లేదని తెలుస్తోంది.ఇదే ఇప్పుడు మహేష్ ని ఇరిటేషన్ కు గురి చేస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. తన సినిమా స్క్రిప్ట్ ని ఎప్పుడు లాక్ చేస్తాడా? .. ఎప్పుడు తనకు వివరిస్తాడా అని మహేష్ ఎదురుచూస్తున్నారట. త్రివిక్రమ్ మాత్రం పవన్ సినిమాల పనుల్లో బిజీగా వుంటున్నారు. ఇటీవలే ఫైనల్ స్క్రిప్ట్ ని పూర్తి చేసే పనుల్లో నిమగ్నమయ్యారట. మహేష్ ప్రస్తుతం ఫ్యామిలీతో స్పెయిన్ లో వున్నారు. తిరిగి వచ్చాక సర్కారు వారి పాట ప్రమోషన్స్ లో పాల్గొంటారు. ఆ తరువాతే త్రివిక్రమ్ స్క్రిప్ట్ ని మహేష్ కు వినిపిస్తారట. ఆ తరువాత జూలైలో సినిమాని ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారట. పూజా హెగ్డే హీరోయిన్ గా ఇప్పటికే ఫైనల్ చేశారు. తమన్ సంగీతం అందించబోతున్నారు.

## అడివిశేష్ మేజర్ అప్ డేట్ ఇచ్చేశాడు

విభిన్నమైన మూవీస్ ని ఎంచుకుంటూ హీరోగా బ్యాక్ టు బ్యాక్ విజయాల్ని సొంతం చేసుకుంటున్నారు యంగ్ హీరో అడివి శేష్. కథబలమున్న సినిమాలతో పాటు ఆసక్తిని రేకెత్తించే సంఘటనల ఆధరంగా రూపొందుతున్న చిత్రాల్లోనూ నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నారు. అడివి శేష్ నటిస్తున్న తాజా చిత్రం మేజర్. ముంబై దాడుల నేపథ్యంలో అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిన చిత్రమిది. మేజర్ ఉన్నికృష్ణన్ ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన ఈ చిత్రాన్ని ఆయన బయోపిక్ గా రూపొందిస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ తో కలిసి సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ మూవీని నిర్మించారు.గూడచారి ఫేమ్ శశి కిరణ్ తిక్క దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీస్ సయీ మంజ్రేకర్ శోభితా దూలిపాళ ప్రకాష్ రాజ్ రేవతి మురళీశర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 2008లో ముంబైలోని తాజ్ మహల్ ప్యాలెస్ హెూటల్ పై జరిగిన ఉగ్రదాడి ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అదే ఉదంతం నేపథ్యంలో మేజర్ చిత్రాన్ని రూపొందించారు. అడివి శేష్ చిత్రాల్లోనే అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ చిత్రం గత కొంత కాలంగా రిలీజ్ వాయిదా పడుతూ వస్తోంది.ఇప్పటికే ఫస్ట్ గ్లింప్స్ తో సినిమాపై అంచనాల్ని పెంచేసింది చిత్ర బృందం. మేజర్ ఉన్నికృష్ణన్ పాత్రలో అడివి శేష్ మేజర్ గా కనిపించిన సన్నివేశాలు బ్లాస్టింగ్స్ ఓ రేంజ్ లో సినిమా హాలీవుడ్ యాక్షన్ చిత్రాలని గుర్తు చేసేలా వుందంటూ ప్రేక్షకులు కామెంట్ చేయడంతో సినిమా కు మరింత హైప్ క్రియేట్ అయింది. దీంతో ఇటీవల వరుస వాయిదాలు పడుతున్న ఈ మూవీ రిలీజ్ ని మేకర్స్ ఫైనల్ చేశారు. జూన్ 3న వరల్డ్ వైడ్ గా తెలుగు తమిళ హిందీ భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేయబోతున్నట్టుగా చిత్ర బృందం ప్రకటించింది.




సినిమా రిలీజ్ మరో నెల రోజులు వుండటంతో చిత్ర బృందం ప్రమోషనల్ యాక్టివిటీస్ ని ప్రారంభించేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ వీడియోని విడుదల చేస్తూ చిత్ర బృందం ట్రైలర్ రిలీజ్ డేట్ కు సంబంధించిన అప్ డేట్ ని ఇచ్చేసింది. ఈ మూవీని తెలుగు హిందీ భాషల్లో సైమల్ టెనియస్ గా షూట్ చేశామని తెలియజేస్తూ ఓ వీడియోని విడుదల చేసిన మేకర్స్ ట్రైలర్ ని మే 9న విడుదల చేస్తున్నామని ఇండియన్ రియల్ హీరో స్టోరీని సెలబ్రేట్ చేసుకోవడానికి రెడీగా వుండండి అంటూ ప్రకటించింది.టీజర్ లోనే ఇరగదీసిన మేజర్ టీమ్ ట్రైలర్ లో ఇంకా ఏ రేంజ్ లో విధ్వంసం సృష్టించారో అని ఆడియన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అడివి శేష్ కెరీర్ కి మైల్ స్టోన్ గా నిలవనున్న ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద తెలుగు తమిళ హిందీ భాషల్లో సంచలనాలు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి కథ అడివి శేష్ మాటలు అబ్బూరి రవి అక్షత్ అజయ్ శర్మ (హిందీ) సినిమాటోగ్రఫీ వంశీ పచ్చిపులుసు.

## స్టార్ డైరెక్టర్ కు డబుల్ ప్రెజర్?

స్టార్ డైరెక్టర్ ఇప్పుడు డబుల్ ప్రెజర్ తో వున్నారా? అంటే ఇండస్ట్రీ వర్గాలు నిజమే అంటున్నాయి. గతంలో తను చేసే సినిమా విషయంలో చాలా కూల్ గా వుండే స్టార్ డైరెక్టర్ తాజా ఫ్లాప్ తో చాలా డిజప్పాయింట్ కు లోనయ్యారని తదుపరి ప్రాజెక్ట్ పరంగా డబుల్ ప్రెజర్ ని ఫీలవుతున్నారని ఇన్ సైడ్ టాక్.వివరాల్లోకి వెళితే. మెగాస్టార్ చిరంజీవి - మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తొలిసారి కలిసి నటించిన భారీ చిత్రం ఆచార్య ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం తొలి రోజే అనూహ్యంగా డిజాస్టర్ టాక్ ని సొంతం చేసుకుంది.దీంతో ఫ్యాన్స్ తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. దాదాపు రెండేళ్ల విరామం తరువాత బాస్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై అభిమానులు భారీ ఎక్స్ పెక్టేషన్స్ పెట్టుకున్నారు. అయితే ఆ అంచనాలని తలకిందులు చేస్తూ ఆచార్య షాకిచ్చింది.ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకొచ్చినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తొలి సారి చిరుతో కలిసి నటించినా సినిమాని కాపాడలేకపోయారు. ఇదిలా వుంటే ఈ మూవీ డిస్ట్రిబ్యూషన్ హక్కుల్ని భారీ మొత్తాలకు సొంతం చేసుకున్న వారంతా దాదాపు 100 కోట్ల మేర నష్టాలని చవిచూసే అవకాశం వుందని ట్రేడ్ వర్గాలంటున్నాయి.ఈ నేపథ్యంలో దర్శకుడు కొరటాల శివ కు డబుల్ ప్రెజర్ మొదలైందట. భారీ అంచనాలు పెట్టుకున్న సినిమా ఆశించిన ఫలితాన్ని అందించకపోవడంతో కొంత నిరుత్సాహానికి గురైన డైరెక్టర్ తన తదుపరి మూవీ విషయంలో మరింత ప్రెజర్ గా ఫీలవుతున్నారట. ఆచార్య తరువాత స్టార్ డైరెక్టర్ కొరటాల శివ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో ఓ భారీ మూవీని చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో యువ సుధా ఆర్ట్స్ బ్యానర్ పై మిక్కిలినేని సుధాకర్ నిర్మించబోతున్నారు.ఇప్పటికే ఈ చిత్రానికి స్క్రిప్ట్ లాక్ అయిపోయింది. ఈ ప్రాజెక్ట్ ని ప్రకటించి చాలా నెలలు అవుతోంది అయితే మే 20న హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రత్యేక అనౌన్స్ మెంట్ ని చేయబోతున్నారట. ఇందుకు సంబంధించిన ప్లాన్ కూడా రెడీ అయిందని ఇటీవల ఆచార్య ప్రమోషన్స్ లో దర్శకుడు కొరటాల శివ స్పష్టం చేశారు. అయితే ఆచార్య ఫలితం ప్రభావం



ఎన్టీఆర్ సినిమాపై పడే అవకాశం వుంది కాబట్టి ఈ విషయంలో దర్శకుడు ప్రెజర్ ఫీలవుతున్నారట. ట్రిపుల్ ఆర్ తరువాత చరణ్ చేసిన సినిమా ఆచార్య. ఇది ఆశించిన ఫలితాన్నివ్వలేకపోయింది. అయితే అదే ట్రిపుల్ ఆర్ లో నటించిన మరో హీరో ఎన్టీఆర్ తో ఇదే దర్శకుడు సినిమా చేయబోతున్నాడు. ఎన్టీఆర్ 30వ సినిమాగా తెరపైకి రానున్న ఈ మూవీ విషయంలోనూ దర్శకుడు కొరటాల శివ సెంటిమెంట్ ఫీలవుతున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. దర్శకుడిగా తన కెరీర్ లో అపజయమే ఎరుగని వ్యక్తిగా రికార్డ్ వున్న ఆయన తాజాగా ఫ్లాప్ ని చూడటంతో తన నెక్స్ట్ మూవీ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ప్రెజర్ ఫీలవుతున్నారట. మరింతగా స్క్రిప్ట్ ని చెక్ చేసుకుంటున్నారట. పాన్ ఇండియా స్థాయిలో అత్యంత భారీగా తెరకెక్కనున్న ఎన్టీఆర్ 30 వ సినిమా ఈ నెలలోనే ప్రారంభం కాబోతోందని తెలుస్తోంది.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com